

సంఘటనా స్థలంలో మృతి చెందిన వ్యక్తి, క్షతగాత్రులు

బతుకుదెరువుకు వచ్చి బలైపోయారు..

- గ్రానైట్ బండల లోడ్‌తో వెళ్తున్న వ్యాన్ బోల్తా పడి ఇద్దరు దుర్మరణం
- మరో ఎనిమిది మందికి తీవ్రగాయాలు
- మృతుల్లో ఒకరు మహబూబాబాద్ జిల్లా వాసి
- డ్రైవర్ అతివేగం వల్లే ప్రమాద ఘటన



నునావత్ వీరన్న



బాణోతు హుస్సేన్

ముదిగొండ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పొట్టకూటి కోసం వచ్చి రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోగా, మరో ఎనిమిది మందికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన ఖమ్మం జిల్లా ముదిగొండ సమీపంలోని నేషనల్ హైవేపై శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం రాముతండాకు చెందిన నునావత్ వీరన్న(28), భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం కొమరారం బాలుతండాకు చెందిన బాణోతు హుస్సేన్(35) బతుకుదెరువు కోసం వచ్చి ఖమ్మం కైకొండాయిగూడెంలో నివసిస్తున్నారు. వీరు గ్రానైట్ బండలను లోడింగ్, అన్‌లోడింగ్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రోజు లాగానే శుక్రవారం ఉదయం నేలకొండపల్లి మండలం గువ్వలగూడెం వద్దగల గ్రానైట్ ఫ్యాక్టరీ నుంచి అన్‌పాలీష్ బండలను డీసీఎం వ్యాన్‌లో లోడింగ్ చేసుకొని బయలుదేరారు.

ఈ క్రమంలో ముదిగొండ వద్ద జాతీయ రహదారిపై డ్రైవర్ అతివేగంగా నడపడంతో వ్యాన్ వీల్‌బోల్ట్ విరిగి బోల్తాపడింది. దీంతో గ్రానైట్ బండలపై కూర్చొని ఉన్న వీరన్న, హుస్సేన్, బాణోతు రాందాస్, వాంకుడోతు కర్నా, అశోక్, బాణోతు కుమార్, బోడా సుందర్, రవి, తేజావత్ వినోద్, డ్రైవర్ వీరన్న (మిగతా 6వ పేజీలో)



సాధారణంగా పంట సీజన్‌లో మిర్చి రైతులు, వ్యాపారులు ఎండు మిర్చిని ఏసీ గోదాముల్లో నిల్వ చేసి, అన్‌సీజన్‌లో ధర పెరిగినప్పుడు విక్రయించి లాభాలు పొందుతారు. కానీ గత కొంతకాలంగా మార్కెట్‌లో మిర్చి ధరలు భారీగా పతనం కావడంతో గత ఏడాది ఏసీ గోదాముల్లో మిర్చి నిల్వ చేసిన రైతులు, వ్యాపారులు భారీగా నష్టపోయారు. దాంతో ఈసారి రైతులు, వ్యాపారులు మిర్చిని ఎప్పటికప్పుడు అమ్మేస్తున్నారు. దీంతో జిల్లాలోని ఏసీ గోదాంలు ఈసారి ఖాళీగా ఉండే పరిస్థితి నెలకొంది. జిల్లాలో 40లక్షల బస్తాలకు పైగా పట్టే ఏసీ గోదాంలలో ప్రస్తుతం 3లక్షల బస్తాలు మాత్రమే నిల్వ ఉన్నాయి. అవి కూడా గత ఏడాదికి సంబంధించిన సరుకు మాత్రమే ఉండడం గమనార్హం..

తెగనమ్ముకుంటున్నారు..

- ఎండు మిర్చిని నిల్వ చేసేందుకు రైతుల విముఖత
- కోల్డ్ స్టోరేజీలకు తగ్గిన గిరాకీ
- గత ఏడాది నష్టాలతో మారిన వైఖరి
- సీజన్‌లోనే పంటను విక్రయిస్తున్న రైతులు, వ్యాపారులు

ఖమ్మం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఈ ఏడాది ఖమ్మంమార్కెట్‌లో ఇప్పటి వరకు సుమారు 8లక్షల బస్తాలు మిర్చి కొనుగోలు జరిగింది. గతేడాది మిర్చి మార్కెట్‌లో 25లక్షల బస్తాలు కొనుగోలు జరగ్గా కోల్డ్‌స్టోరేజీలో మాత్రం రైతులు, వ్యాపారులు సుమారు 40లక్షల బస్తాలు నిలువ ఉంచి దేశంలోని పలు మార్కెట్లకు, వ్యాపారుకలు విక్రయించారు. విదేశాలకు కూడా ఎగుమతి చేశారు.

గతేడాది క్వింటాకు మార్కెట్‌లో క్వింటా మిర్చి రూ.15నుంచి 20వేల వరకు కొనుగోలు చేసి ఏసీ గోదాంలలో నిలువ ఉంచారు. అయితే ఈసారి జూన్‌నుంచి ధరలు పెరగకపోగా క్రమంగా తగ్గుతూ రూ.14వేలకు పడిపోయింది. దాంతో రైతులు, వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారు. 2020-23వరకు ప్రతిఏటా మిర్చిసీజన్‌లో క్వింటాకు రూ.12నుంచి 15వేల వరకు ధర ఉండగా వ్యాపారులు, రైతులు ఏసీగోదాంల్లో నిల్వ చేసి అన్‌సీజన్‌లో రూ.20నుంచి రూ.25వేలకు విక్రయించారు. దీంతో క్వింటాకు రూ.5నుంచి 10వేల వరకు లాభాలు పొందారు. గతేడాది సీజన్‌లో ధర పెరుగుతందని ఆశించినా ధరలు పతనమై తీవ్రంగా నష్టపోయారు.

ఈ పరిణామాలను గమనించిన మిర్చి రైతులు, వ్యాపారులు ఈసారి పంట పుష్కలగా పండినా ధర తక్కువ ఉన్నా ఎప్పటి మిర్చి అప్పుడే విక్రయిస్తున్నారు. ఏసీ గోదాంలో పెడితే అన్‌సీజన్‌లో ధరపెరగకపోతే నష్టపోతామన్న భయంతో రైతులున్నారు. ఏసీ గోదాంలో నిలువ ఉంచితే ఏడాదికి బస్తాకు రూ.205 చెల్లించాలి. క్వింటాకు సుమారు రూ.600పైగా ఏసీ ఖర్చు వస్తుంది. రవాణాఖర్చులు ఇతర ఖర్చులతో రైతులపై తీవ్ర భారం పడనుంది. దీంతో పరిస్థితి గ్రహించిన రైతులు ఏసీ గోదాంలవైపు చూడకపోవడంతో ఏసీ గోదాంల యజమానులు కూడా ఈసారి నష్టపోయే పరిస్థితి నెలకొంది. జిల్లాలో 40వరకు ఏసీ గోదాంలున్నాయి. ఖమ్మం, కొణిజర్ల, మధిర, తల్లాడ, వైరా తదితర మండలాల్లో ప్రైవేటు ఏసీ గోదాములు ఉన్నాయి. ఏసీలో మిర్చి పెడితేనే ఈగోదాంల నిర్వహణ సాధ్యమవుతుంది. వీటికి ప్రతినెల లక్షల్లో కరెంట్ బిల్లు వస్తుంది. దీనికితోడు ఇన్సూరెన్స్ భారం కూడా అధికమే. ఈ పరిస్థితుల్లో పూర్తిస్థాయిలో గోదాంలలో మిర్చి పెడితేనే వాటి నిర్వాహణకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా ఉంటాయని, రైతులు మిర్చిపెట్టకపోతే గోదాంలు కూడా మూతపడే పరిస్థితి నెలకొంది. మిర్చి పంట ఈసారి దేశంలో పలు ప్రాంతాలతో పాటు ఇతర దేశాల్లో కూడా విస్తారంగా పండింది. తెగుళ్ల తగ్గాయి.

దాంతో దేశీ, విదేశీవ్యాపారులు మిర్చి కొనుగోళ్లపై ఆసక్తి చూపడంలేదు. ఎగుమతి ఆర్డర్లు అంతంతమ్రాతంగానే ఉండడంతో మిర్చి మార్కెట్ స్తబ్దుగా ఉంది. ప్రస్తుతం పలుకుతున్న ధరలు రైతులకు గిట్టుబాటయ్యే పరిస్థితి కనిపించడంలేదు.

మిర్చి అమ్మేసుకుంటున్నాం

వసంత్, ఉప్పలచలక, కొణిజర్ల మండలం



ప్రతిఏటా మిర్చిని ఏసీలో నిలువ ఉంచే వాళ్లం.. గత ఏడాది ఇలా పెట్టి ధరలేక తీవ్రంగా నష్టపోయాం. అందువల్ల ఈసారి ఏసీలో పెట్టడం లేదు. ఎప్పటి మిర్చి అప్పుడే అమ్ముతున్నాం. ప్రస్తుత పరిస్థితుల్లో ఏసీలో నిలువ ఉంచాలంటే పెద్ద రైతులకే సాధ్యమవుతుంది. చిన్న, మధ్యతరగతి రైతులు ప్రస్తుతం ధర లేని కారణంగా పంట అమ్ముకుంటున్నారు.

రైతులు ఉత్సాహం చూపడంలేదు

గీతా వెంకన్న, ఏసీ గోదాం యజమాని

మార్కెట్‌లో మిర్చి ధర తక్కువగా ఉండడంతో రైతులు ఏసీ గోదాంలలో పంట ఉంచేందుకు ఉత్సాహం చూపడంలేదు. గత ఏడాది వ్యాపారులు, రైతులు భారీగా నిల్వచేసినా ధరల పతనంతో నష్టపోయారు. అదే పరిస్థితి వస్తుందన్న భయం అందరిలో ఉంది. రూ.కోట్లు పెట్టుబడి పెట్టి నిర్మించిన ఏసీ గోదాంలలో మిర్చి లేకపోతే యజమానులూనష్టపోయే పరిస్థితి ఉంది. ప్రతిఏటా ఏసీ గోదాంల నిర్వహణకు కరెంట్ బిల్లులు, జీతభత్యాలకు రూ.కోటిపైగానే ఖర్చు వస్తుంది. మిర్చిబస్తాలు పూర్తిగా నిండకపోతే గోదాంలు కూడా మూతపడే పరిస్థితి ఉంది.

అమ్ముకుంటేనే ఖర్చులు వస్తాయి

జి.వెంకన్న, పాలేరు



మిర్చి ధర తక్కువగా ఉంది. గతంలో క్వింటా రూ.20నుంచి రూ.25వేలు ధర ఉండగా ఇప్పుడు రూ.14వేలలోపే ధర పలుకుతోంది. గతేడాది కూడా సీజన్ తరుణంలో ధర ఆశాజనకంగా పలికింది. ఇప్పుడు దిగుబడులున్నా ధర లేదు. పెట్టుబడి, కూలీల ఖర్చులు ఇవ్వాలంటే మిర్చి అమ్ముకుని సొమ్ము వస్తేనే అప్పులు కట్టే పరిస్థితి ఉంటుంది. అందువల్ల ఏసీ గోదాంలలో మిర్చిని పెట్టడంలేదు.



సన్ లైట్‌హౌజ్..

అది ఉషోదయమైనా.. సంధ్య వేళ అయినా.. భానుడి తేజస్సు మురిపిస్తుంది. ఆహ్లాదాన్ని పంచుతూ మైమరిపిస్తుంది. ఆకాశం అరుణవర్ణాన్ని పులుముకొని ధగధగా మెరిసిపోతుంటే సూర్యుని అస్తమయ ఘట్టం కూడా సరికొత్త అనుభూతిని కలిగిస్తుంది. కవులకు, గీతకారులకు పాటల మాలికను గుదిగుచ్చే ఆ'దారం' అవుతుంది. చలికాలం కరిగిపోతూ, ఎండాకాలం మొదలవుతున్న వాతావరణ తరుణంలో.. శుక్రవారం సాయంత్రం స్తంభాద్రి నర్సింహస్వామి గుట్టపైనుంచి 'సన్ సెట్' ఇదిగో ఇలా అపురూపంగా కనిపించింది. సెల్ టవర్ కొసన కొలువుదీరిన సూర్యుడిని చూస్తుంటే... ఖమ్మం నగరానికి సరికొత్త సన్ లైట్‌హౌస్ ఏదో ఏర్పాటు చేసినట్టుగా లేదూ!

-ఫొటో: స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి/ఖమ్మం

నగరంలో మరో ఆధ్యాత్మిక పర్వం

- ప్రతీ నెల స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి గిరి ప్రదక్షిణ
- ఈ నెల 18న తొలిసారిగా నిర్వహణ
- సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు కార్యక్రమం



ఖమ్మం ఖానాపురం హవేలి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నగరంలో స్వయంభూ దివ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి (గుట్ట) సన్నిధిలో ప్రతీ నెల స్వామి వారి జన్మనక్షత్రం రోజున గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి కొత్తూరు జగన్‌మోహన్‌రావు, ఆలయ అర్చక బృందం తెలిపింది. ఈ కార్యక్రమ పరంపరలో భాగంగా ఈ నెల 18న (మిగతా 6వ పేజీలో)

ఎన్నాళ్లీ ఎదురుచూపులు?

- ఇల్లెందు జేకే 5 ఓసీ విస్తరణలో తీవ్రజాప్యం
- విస్తరణతోనే పురిటిగడ్డకు సింగరేణి శోభ
- జాప్యం అవుతున్న అనుమతులు
- మూసివేత దిశలో జేకే 5 ఓసీ

ఇల్లెందు ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నల్లబంగారానికి జన్మనిచ్చిన ఇల్లెందు ఏరియాలో కార్మికులు, ప్రజలు జేకే5 విస్తరణ ప్రాజెక్టు కోసం నిరీక్షిస్తున్నారు. పూసపల్లి ఏరియాలో చేపట్టనున్న విస్తరణ పనులకు వివిధ శాఖల అనుమతులకు తీవ్రజాప్యం జరుగుతుండటంతో కార్మికుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది.

ఇల్లెందు ఏరియా పొలిమేరల్లో ఉన్న జేకే 5 ఓసీ ప్రాజెక్టులో బొగ్గు నిల్వలు పూర్తి కావడంతో మార్చి మాసాంతరానికి యాజమాన్యం నిర్ణయించడం, నూతన ప్రాజెక్టు పనులు ప్రారంభం కాకపోవడంతో గనిలో పనిచేస్తున్న దాదాపు 250 మంది కార్మికుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. సకాలంలో విస్తరణ పనులు ప్రారంభించకపోతే ప్రస్తుత ఓపెన్‌కాస్ట్‌లో పనిచేస్తున్న కార్మికులను ఇతర ప్రాంతాలకు బదిలీ చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో పూసపల్లి ఏరియాలోని నూతన విస్తరణ పనులకు పెండింగ్‌లో ఉన్న అనుమతులను త్వరితగతిన అనుమతులు సాధించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

ఇల్లెందు ఏరియాలో జేకే 5 ఓసీ పూసపల్లి విస్తరణ పనులకు రెండేళ్ల క్రితమే జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజామోదం లభించింది. విస్తరణ జరగనున్న భూభాగంలో తిలక్ నగర్, విజయలక్ష్మి నగర్, కుమ్మరి బస్తి, 21 ఏరియాలో ప్రభావానికి గురికానున్నాయి. ఓసీ విస్తరణకు సంబంధించి అటవీశాఖ స్టేజీ 1 కు క్లియరెన్స్ లభించినప్పటికి ఎన్విరాల్‌మెంటల్ క్లియరెన్సు లభించాల్సి ఉండటం, తదుపరి అటవిశాఖ స్టేజీ2 కు అవసరమైన క్లియరెన్స్‌ను పొందవలసి ఉంది. భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల పరిధిలోని అటవీప్రాంతాల్లో విస్తరించి ఉన్న ఓపెన్‌కాస్ట్ విస్తరణ పనులకు సంబంధించి రెండు జిల్లాల అటవీశాఖల క్లియరెన్సు లభించాల్సి ఉంది. అంతేకాక అటవీ భూ సేకరణకు (మిగతా 6వ పేజీలో)



ఓపెన్‌కాస్ట్ ప్రతిపాదిత ప్రాంతం



నేడు ఎమ్మెల్సీ కవిత రాక

- బీసీ కులాల రౌండ్‌టేబుల్ సమావేశానికి హాజరు

ఖమ్మం ఖానాపురం హవేలి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ నేత, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత శనివారం నగరంలో పర్యటించనున్నారు. ఉదయం 10గంటలకు ఖమ్మం సబ్ జైలులో ఉన్న బీఆర్‌ఎస్ నాయకుడు లక్కినేని సురేందర్‌ను పరామర్శిస్తారు. 10-30 గంటలకు నగరంలోని పాండురంగాపురంలో గల సేవాలాల్ మందిరాన్ని సందర్శించి, 11గంటలకు బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు ఇంటికి వెళ్తారు. 11-30 గంటలకు బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో సంత్‌సేవాలాల్ జయంతి కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం కార్యకర్తలతో భేటీ అవుతారు. మధ్యాహ్నం 1గంటకు రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఇంటికి వెళ్తారు. 2 గంటలకు సప్తపది ఫంక్షన్‌హాల్‌లో జాగృతి ఆధ్వర్యంలో బీసీ సంఘాల నాయకులతో రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొంటారు. 4-30గంటలకు బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు (మిగతా 6వ పేజీలో)

చిన్నారి ఒంటిపై వాతలు నిజం కాదు..

- విచారణలో తేల్చిన ఐసీడీఎస్ అధికారులు
- అంగన్‌వాడీ టీచర్‌ను బలిపశువును చేయడానికే ఆరోపణలు

వివరాలు : 6లో

మిర్చి రైతులకు 'రైతుబంధు'

- వడ్డీ లేకుండా ఆర్నెల్ల వరకు రూ.2లక్షల రుణం
- కోల్డ్ స్టోరేజీలో నిల్వ ఉంచిన వారికి వర్తింపు
- మార్కెటింగ్ శాఖ జేడీ ఉప్పల శ్రీనివాసరావు



కాంటాల ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్‌జేడీ శ్రీనివాసరావు

ఖమ్మం మార్కెట్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మిర్చి రైతులు వడ్డీ లేని 'రైతుబంధు' రుణాలను వినియోగించుకోవాలని మార్కెటింగ్ శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఉప్పల శ్రీనివాసరావు కోరారు. నగరంలోని వ్యవసాయ మార్కెట్‌ను శుక్రవారం సందర్శించిన ఆయన మార్కెట్ అధికారులు, ట్రాలీ వర్కర్స్, హమాలీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం మిర్చి పంటకు గిట్టుబాటు దక్కని కారణంగా పంటను (మిగతా 6వ పేజీలో)



భద్రాచలంలో ప్రసంగిస్తున్న ఐటీడీఏ పీవో రాహుల్

బంగారు భవితకు ప్రేరణ

- గిరి విద్యాసంస్థల్లో కెరీర్ గైడెన్స్ ఆన్ వాల్
- విద్యా, ఉద్యోగ సమాచారంతో ఫ్లెక్సీలు

6



కిష్టారంలో గ్రామస్థుల రాస్తారోకో, అర్ధనగ్న ప్రదర్శన

సైలో బంకర్‌తో చంపేస్తారా?

- పనులు నిలిపివేసి పునరావాసం కల్పించాలి
- రాస్తారోకోలో కిష్టారం గ్రామస్థుల డిమాండ్

6



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న కలెక్టర్ జితేష్ వి. పాటిల్

వైభవంగా ముగిసిన అణుశక్తి క్రీడా, సాంస్కృతిక పోటీలు

అశ్వాపురం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): అణుశక్తి విభాగం 39వ జాతీయ క్రీడా,సాంస్కృతిక పోటీలు శుక్రవారం సాయంత్రం అశ్వాపురం గౌతమీనగర్ కాలనీలోని భారజల కళావేదిక ప్రాంగణంలో వైభవంగా ముగిశాయి. ఈనెల 10నుంచి ఇక్కడ జరుగుతున్న జాతీయ క్రీడా పోటీల్లో భాగంగా బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ముగింపు పోటీలకు కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ముఖ్యఅతిథిగా హాజరయి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్రీడా పోటీలు వివిధ పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగుల మధ్య స్నేహ, సౌభ్రాతృత్వాలను పెంపొందిస్తాయన్నారు. క్రీడల్లో గెలుపు,ఓటములు సహజమని ఓటమిని స్ఫూర్తిగా తీసుకుని గెలుపు కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హెవీవాటర్‌ప్లాంట్ జియం హెచ్‌కె శర్మ,డిజిఎం జి.శ్రీనివాసరావు,గేమ్స్ కన్వీనర్ రఫిక్‌ఆహ్మద్, కార్యదర్శి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోటీల విజేతలు వీరే..

39వ జాతీయ అణుశక్తి క్రీడా పోటీల్లో మాస్టర్స్ మెన్స్ విభాగంలో మహారాష్ట్రకు చెందిన ద్వారకా జట్టు ప్రథమస్థానంలో, ద్వితీయ స్థానంలో, మహిళావిభాగంలో పుష్కర్ జట్టు ప్రథమస్థానంలో గోల్కొండ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి. పురుషుల సింగిల్స్ విభాగంలో ద్వారకా జట్టు ప్రథమ, గోల్కొండ జట్టు ద్వితీయస్థానంలో, సింగిల్స్ మహిళా విభాగంలో అజంతా జట్టు ప్రథమ, ద్వితీయస్థానాల్లో, పురుషుల డబుల్స్ విభాగంలో గోల్కొండ ప్రథమ, రామేశ్వరం ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. మహిళల డబుల్స్ విభాగంలో అజంతా జట్టు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి.

సత్వర పౌర సేవలకు జోనల్ కార్యాలయాలు



- త్వరలోనే ప్రజలకు చేరువ కానున్న అధికారులు
- నగరంలో ఇప్పటికే ఆరు జోన్లుగా డివిజన్ల విభజన
- వరదలు, ఇతర కారణాలతో ఆలస్యం

ఖమ్మం సంక్షేమ విభాగం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): 'ప్రజల వద్దకే పరిపాలన' నినాదంతో ఖమ్మం నగర పాలక సంస్థ పరిపాలన విభాగంలో విధాన పరమైన సమూల మార్పులు చేయడానికి ఆరు నెలల క్రితం కార్యాచరణ చేశారు. హైదరాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ తరహాలోనే ఖమ్మం నగరంలోని 60 డివిజన్లను ఆరు జోన్లుగా విభజించాలనుకున్నారు. ప్రతీ జోన్‌కు పది డివిజన్లు కేటాయించి స్థానికంగానే కార్యాలయం ఏర్పాటు చేసేందుకు ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య కసరత్తు చేశారు. ఇప్పటికే ఆరు జోనల్ కార్యాలయాలను ఏర్పాటు చేశారు. అయితే మున్నేరుకు వరద పోటు, ఇతర కారణాలతో జోనల్ వ్యవస్థ కార్యరూపం దాల్చలేదు.

90వేల జనాభాకు ఒక కార్యాలయం

ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో 90వేల నుంచి లక్ష జనాభాఉన్న ప్రతి 10 డివిజన్లకు ఒక జోనల్ కార్యాలయం ఏర్పాటు చేయాలనుకున్నారు. ప్రతి జోనల్ కార్యాలయంలో లైజనింగ్ అధికారి పర్యవేక్షణలో కేఎంసీ రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, పారిశుధ్యం, ఇంజనీరింగ్, ఇతర విభాగాలను ఏర్పాటు చేసి ప్రత్యేకంగా ఆయా విభాగాలకు చెందిన అనుభవం కలిగిన అధికారులను బాధ్యులను కేటాయించనున్నారు. విలీన గ్రామాలు, డివిజన్ల నుంచి ఫిర్యాదుదారులు ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయం వరకు రాకుండానే స్థానికంగా ఉన్న జోనల్ కార్యాలయానికి వెళ్తే సత్వర పౌర సేవలు పారదర్శకంగా సేవలు పొందవచ్చు. ప్రతి జోనల్ కార్యాలయంలో పౌరసేవ పత్రాలను ఏర్పాటు చేసి జోనల్ కార్యాలయాలను కేఎంసీతో అనుసంధించనున్నారు. నగరంలోని ఎన్టీఆర్ సర్కిల్, నయాబజార్, ముస్తాఫానగర్, గాంధీచౌక్, మమతా రోడ్డు, రాపర్తి నగర్ ప్రాంతాల్లో జోనల్ కార్యాలయాలు ఏర్పాటు ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి.

అనుకోని అవాంతరాలు..

ఆగస్టులోనే ఖమ్మం జోనల్ వ్యవస్థకు వినూత్నంగా కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య కార్యాచరణ చేశారు. సెప్టెంబరులో వరదలు, తర్వాత వేర్వేరు కారణాలు, ప్రజాపాలన, సమగ్ర కుటుంబ సర్వే, ఇందిరమ్మ ఇళ్ల సర్వే, రేషన్‌కార్డుల సర్వే, ఆదాయ వసూళ్ల స్పెషల్ డ్రైవ్ వంటి ఇతర కారణాలు జోనల్ వ్యవస్థకు ఆటంకాలుగా నిలిచాయి. ప్రాంతాల విభజన నుంచి కార్యాలయాలు కేటాయింపు వరకు పూర్తిచేశారు. జోనల్ వ్యవస్థ త్వరగా ప్రజలకు అందుబాటులోకి వస్తే కేఎంసీ కార్యాలయం చుట్టూ ప్రజలకు ఇబ్బందులు తొలగనున్నాయి. సమీప జోనల్ కార్యాలయం నుంచి అన్ని రకాల మునిసిపల్ సేవలు ప్రజలకు అందుబాటులో రానున్నాయి.



ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ జోనల్ వ్యవస్థ మ్యాప్



పరిపాలన వికేంద్రీకరణ కోసమే: అభిషేక్ అగస్త్య

ఖమ్మం నగరం బాగా విస్తరిస్తోంది. 60 డివిజన్లలో మారుమూల ప్రాంతాల నుంచి ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయానికి పౌర సేవలకు రావటానికి పడుతున్నారు. ప్రజల కోసం అధికార వికేంద్రీకరణలో భాగంగా హైదరాబాద్ జీహెచ్‌ఎంసీ తరహాలో ఆరు జోనల్ కార్యాలయాలు ఏర్పాటు చేయబోతున్నాం. స్థానికంగా ఉన్న పది డివిజన్ల ప్రజలు వారు ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయం వరకు రాకుండానే స్థానిక జోనల్ కార్యాలయానికి వెళ్లి అన్ని రకాల సేవల్ని పొందవచ్చు. త్వరలో జోనల్ కార్యాలయాలు అందుబాటులోకి తీసుకొస్తాం.

స్వర్ణ కవచాలతో రామయ్య దర్శనం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

భద్రాచలం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారు శుక్రవారం సందర్భంగా స్వర్ణ కవచాలతో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. నిత్యకల్యాణ మండపంలో స్వామి వారికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, వేద ఆశీర్వచనం నిర్వహించారు.

వ్యవసాయ కళాశాలలో యూనివర్సిటీ స్థాయి పోటీలు

మూడు రోజుల పాటు క్రీడోత్సవం

అశ్వారావుపేట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో ఈనెల 19, 20, 21 తేదీల్లో ప్రొ.జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం సిబ్బందికి క్రీడా పోటీలు, సాహిత్య, సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నట్లు కళాశాల అసోసియేట్ డీన్ డా. హేమంత్‌కుమార్ తెలిపారు. ఈ పోటీల్లో విశ్వవిద్యాలయం పరిధిలోని నాలుగు జోన్ల నుంచి బోధన సిబ్బంది పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమాలకు విశ్వవిద్యాలయ స్థాయి ప్రముఖులు అనేక మంది పాల్గొంటారని ఆయన తెలిపారు.

పేదల కంటివెలుగు

- నిరుపేదలను ఆదుకుంటున్న ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రి
- ప్రతీ రోజు 200మందికి పైగా ఓపీ సేవలు



కంటి పరీక్ష నిర్వహిస్తున్న వైద్య నిపుణుడు

పాల్వంచ టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నిరుపేదల కంటి వెలుగుగా పాల్వంచలోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి సేవలు అందిస్తోంది. నవభారత్ కంపెనీ వారి సౌజన్యంతో నిర్మించిన కంటి ఆసుపత్రి 2011 ఫిబ్రవరి 19న ప్రారంభమై వేలాదిమందికి కంటి చూపును ప్రసాదించిన ఆసుపత్రిగా ఖ్యాతికెక్కింది. రోజుకు 200మంది పై చిలుకు కంటి వైద్యం కోసం జిల్లా నుంచే కాక పొరుగు జిల్లాల నుంచి కూడ రోగులతో ఓపీ ఉంటోంది. ఆసుపత్రి ప్రారంభించిన నాటి నుంచి నేటి వరకు డిసెంబరు 2024 వరకు 13 సంవత్సరాల కాలంలో 25వేల మంది పై చిలుకు ఉచిత కంటి ఆపరేషన్లు నిర్వహించి ఏజెన్సీ జిల్లా వాసులకు వర ప్రదాయినిగా నిలిచింది.

మొత్తంగా నిర్వహించిన కంటి ఆపరేషన్లు 49వేల పై చిలుకులో 51శాతం ఉచితంగానే పేదలకు సేవలు అందించడం విశేషం. ఆసుపత్రిలో ఆధునాతన మైన సుమారు రూ. కోటి వ్యయం గల ఎక్విప్‌మెంట్‌తో కంటి ఆపరేషన్లు నిర్వహించడం విశేషం. మెరుగైన కంటి వైద్యం కొరకు గతంలో హైదరాబాద్ వంటి నగరాల్లో పొందే వైద్యం అతి తక్కువ ఖర్చుతో నవభారత్ ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిలో పొందే సౌకర్యం ఉండటంతో సంపన్నుల నుంచి సామాన్యుల వరకు ఇక్కడే కంటి వైద్య చికిత్సను పొందుతున్నారు. నవభారత్‌లోని ప్రధాన ఆసుపత్రికి అనుసంధానంగా జిల్లాలో 10 సబ్‌సెంటర్ల ద్వార కూడ విస్తృత సేవలు అందిస్తున్నారు.



వైద్యం కోసం వేచి ఉన్న రోగులు

నిరుపేదలకు ఉచిత వైద్యం..

సి. దేవి చందర్‌రావు, అడ్మినిస్ట్రేటివ్ అధికారి



చూపు తగ్గి కంటి రుగ్మలతో బాధపడుతున్న తెల్లరేషన్‌కార్డు కలిగిన నిరుపేదలకు ఉచిత కంటి ఆపరేషన్లు ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిలో నిర్వహిస్తున్నాం. కార్పొరేట్ స్థాయిలో అతి తక్కువ ఖర్చుతో అన్ని రకాల కంటి శస్త్ర చికిత్సలు ఈ ఆసుపత్రిలో అత్యాధునిక వైద్య పరికరాలు, నిష్ణాతులైన వైద్య నిపుణులు సేవలు అందుబాటులో ఉన్నాయి. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోగలరు.

చిన్నారి ఒంటిపై వాతలు నిజం కాదు..

- విచారణలో తేల్చిన ఐసీడీఎస్ అధికారులు
- అంగన్‌వాడీ టీచర్‌ను బలిపశువును చేయడానికే నని ఆరోపణలు



విచారణ నిర్వహిస్తున్న డీడబ్ల్యూవో

ఖమ్మం ఖానాపురం హవేలి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని గోపాలపురం అంగన్‌వాడీ కేంద్రం-1లో చిన్నారి ఒంటిపై వాతలు తేలిన ఘటన అంతా డ్రామా అని తేలింది. అంగన్‌వాడీ టీచర్‌పై కక్షతో చిన్నారి తల్లిదండ్రులే నాటకం ఆడారని అధికారుల విచారణలో వెల్లడైంది. గోపాలపురంలోని అంగన్‌వాడీ కేంద్రం-1కు బుధవారం రోజులాగే నాలుగేళ్ల చిన్నారి వచ్చింది. ఈ సమయంలో అంగన్‌వాడీ టీచర్, ఆయా అందుబాటులో ఉన్నారు. అయితే మధ్యాహ్నం చిన్నారి ఇంటికి వెళ్లిన తరువాత ఆమె ఒంటిపై వాతలు ఉన్నాయంటూ కుటుంబ సభ్యులు వచ్చి అంగన్‌వాడీ టీచర్, ఆయాలను నిలదీశారు. మా పాపను ఎందుకు కొట్టారంటూ ఆందోళనకు దిగారు. తమకేమీ తెలియదని చెప్పినా వినకుండా, తల్లిదండ్రులు ఐసీడీఎస్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో సూపర్‌వైజర్ కోటేశ్వరి గురువారం ప్రాథమి విచారణ జరపగా, శుక్రవారం జిల్లా అధికారి రాంగోపాల్‌రెడ్డి, సీడీపీవో వీరభద్రమ్మ, సూపర్‌వైజర్ కోటేశ్వరి అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చి విచారణ నిర్వహించారు. చిన్నారుల తల్లితండ్రులను, పక్క ఇంటి యజమానులను విచారించారు. దీంతో చిన్నారిని కొట్టారనే విషయం అవాస్తవమని విచారణలో తెలిందని డీడబ్ల్యూవో తెలిపారు. ఇది కేవలం కావాలని చేసినట్టుగా ఉందని, చిన్నారి శరీరంపై శుక్రవారం ఎలాంటి వాతలు కనిపించలేదని తెలిపారు. ఇదిలావుండగా, అంగన్‌వాడీ టీచర్‌కు, సదరు చిన్నారి తాతయ్యకు మధ్య ఉన్న పాత గొడవలే ఆరోపణలకు కారణమని భావిస్తున్నారు. పాత గొడవలను దృష్టిలో పెట్టుకొనిఅంగన్‌వాడీ టీచర్‌ను బలిపశువును చేయడానికి ప్రయత్నించినట్టు తెలిసింది. కావాలనే చిన్నారి శరీరంపై ఎర్రటి రంగుతో వాతలు గీసినట్టు చెబుతున్నారు.

నేడు ఎమ్మెల్సీ కవిత రాక

(5వ పేజీ తరువాయి)

గుండాల కృష్ణ నివాసానికి వెళ్తారు.

పర్యటనను విజయవంతం చేయండి...

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పర్యటనను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ నేత గుండాల కృష్ణ, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషయ్య కోరారు. నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో శుక్రవారం బీసీ కుల సంఘాలు, జాగృతి నాయకుల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ బీసీ కుల గణనలో బీసీల సంఖ్యను తక్కువగా చూపడంతో ఎమ్మెల్సీ కవిత పోరాటాలకు సిద్ధమయ్యారని, ఇందులో భాగంగా శనివారం నగరంలోని సప్తపది ఫంక్షన్‌హాల్‌లో జరిగే బీసీ కులాల రౌండ్‌టేబుల్ సమావేశానికి ఆమె హాజరవుతున్నారని తెలిపారు. సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జాగృతి నాయకుడు పవన్‌నాయక్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మిర్చి రైతులకు 'రైతుబంధు'

(5వ పేజీ తరువాయి)

కోల్డ్‌స్టోరేజీలలో నిల్వ ఉంచిన రైతులు రైతుబంధు రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కోల్డ్‌స్టోరేజీ బాండ్ ద్వారా రూ. 2 లక్షల వరకు రుణం 6 నెలల కాలపరిమితితో వడ్డీ లేకుండా తీసుకోవచ్చని తెలిపారు. నిల్వ ఉంచిన పంట విలువలో 75 శాతం వరకు రుణం పొందవచ్చని తెలిపారు. రుణం తీసుకొని 6 నెలలు దాటితే నామమాత్రపు వడ్డీతో చెల్లించవచ్చని పేర్కొన్నారు. అనంతరం మార్కెట్ యార్డులో కొనుగోళ్లను పరిశీలించారు. మార్కెట్‌కు మిర్చి పంట పోటెత్తుతున్న నేపథ్యంలో మిర్చి పంట దిగుమతి, తోలకాలపై పలు సూచనలు చేశారు. మార్కెట్‌లో దడవాయిలు, ట్రాలీల విషయంలో ఇబ్బందులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. మార్కెట్‌లో క్రయ విక్రయాలు సజావుగా సాగేందుకు మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, వైస్ చైర్మన్ తల్లాడ రమేష్ సహకారంతో అధికారులు నడుచుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, గ్రేడ్‌టూ సెక్రటరీ సృజన్ బాబు, ఏఎస్ ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

బతుకుదెరువుకు వచ్చి బలైపోయారు..

(5వ పేజీ తరువాయి)

కిందపడిపోయారు. వీరిలో వీరన్న, హుస్సేన్‌లు గ్రానైట్ బండల మధ్య నలిగిపోవడంతో అక్కడికక్కడే మృతిచెందారు. మిగిలిన 8 మందికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను 108వాహనం ద్వారా ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుడు సునావత్ వీరన్నకు భార్య భార్గవి, కుమారుడు, కుమార్తె ఉండగా, మరో మృతుడు బాణోతు హుస్సేన్‌కు భార్య రూత, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వీరన్న భార్య భార్గవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ మురళీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నాళ్లో ఎదురుచూపులు...

(5వ పేజీ తరువాయి)

సంబంధించి సింగరేణి కాలరీస్ యాజమాన్యం రూ 30 కోట్లు డిపాజిట్ చేయాల్సి ఉంది. క్లియరెన్స్‌లు లభిస్తే ఓసీ విస్తరణ పనులు ప్రారంభించుకొనే సౌలభ్యం ఉండటంతో సింగరేణి అధికారలు ముమ్మర ప్రయత్నాలు సాగిస్తున్నారు. 18కిలోమీటర్ల పరిధిలో ఓసీ రేడియేషన్ ప్రభావిత ప్రాంతంగా ఉంటడంతో ఒకవైపు అటవీశాఖ, మరోవైపు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు క్లియరెన్సుల కోసం యాజమాన్యం ఎదురుచూస్తోంది.

క్లియరెన్సులు లభిస్తే ప్యాకెజీల సర్వే ప్రారంభం

ఇల్లెందు జేకే 5ఓసీకి సంబంధించి పూసపల్లి విస్తరణ ప్రాజెక్టుకు స్టేజీ2 అటవీశాఖ క్లియరెన్సు లభించగానే ప్రభావిత ప్రాంతాల నివాస ప్రజల పునరావాస పథకాల అమలుకు సంబంధించి సర్వే నిర్వహించేందుకు అధికారులు నిర్ణయించారు. ఇప్పటి వరకు పూసపల్లి ఓసీ ప్రాజెక్టుకు సంబంధించి జనాభా సర్వే మాత్రం పూర్తికాగా, ఇంకా సోషియో ఎనామిక్ సర్వే జరగాల్సిఉంది. నిర్వాసితులు నష్ట పోతున్నా ఆస్తుల సర్వే మొదలుకొని నిర్వాసితుల పునరావాసానికి సంబంధించిన పథకాలు ప్యాకేజీలకు అర్హులైన లబ్ధిదారులను గుర్తించాల్సి ఉంది. వారి ఆమోదంతో పరిహారాలు చెల్లించిన పిదపనే పూసపలి ఏరియాలో ఓసీ విస్తరణ పనులు ప్రారంభించే అవకాశాలు ఉన్నట్లు తెలిసింది. ఈ క్రమంలో మార్చి 31 నాటికి జేకే 5 ఓసీ మూతపడనుండటంతో ఆ గనుల్లో పనిచేస్తున్న కార్మికులను ఏరియాలోని కోయగూడెం, పూసపల్లి గనుల్లో సర్దుబాటు చేయాలన్న యోచనతో యాజమాన్యం ఓసీ విస్తరణ క్లియరెన్సుల కోసం తీవ్ర స్థాయిలో యత్నిస్తోంది.

నగరంలో మరో ఆధ్యాత్మిక పర్వం

(5వ పేజీ తరువాయి)

మొదటిసారిగా ఖమ్మం నగరంలో స్తంభాద్రి గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్నామని తెలిపారు. గిరి ప్రదక్షిణ సాయంత్రం 5 గంటలకు ప్రారంభమై రాత్రి 7గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ గిరి ప్రదక్షిణ సుమారు 2 కిలోమీటర్ల మేర ఉంటుందని, గుట్ట కింద భాగం నుంచి ప్రారంభమై గుట్ట చుట్టూ తిరుగుతూ పాత కల్యాణ మండపం నుంచి గుట్ట పైకి చేరుకుంటుందని తెలిపారు. ప్రదక్షిణ అనంతరం కొండపైన గల ప్రత్యేక వేదికపై దివ్య జ్యోతి దర్శనంతో ప్రదక్షణ ముగుస్తుందని తెలిపారు. అరుణాచలం, సింహాచలం, యాదగిరి గుట్ట తరహాలో ఖమ్మం స్తంభాద్రి గుట్ట గిరి ప్రదక్షిణ భక్తులకు అందుబాటులోకి తెస్తున్నట్టు తెలిపారు.

సైలోబంకర్‌తో చంపేస్తారా...?

- సింగరేణికి భూములిచ్చి కాలుష్యం కోరల్లో చిక్కుకున్నాం
- కిష్టారంలో జాతీయ రహదారిపై గ్రామస్థుల అర్ధనగ్న ప్రదర్శన
- 5వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు



కిష్టారంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్న పోలీసులు

సత్తుపల్లి రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): 'ఒకప్పుడు మేం పాడిపంటలు, ఆయురారోగ్యాలతో తులతూగే వాళ్లం.. కానీ నేడు చనిపోతే శవాలను పూడ్చేందుకు స్థలాలకు వెతుక్కోవాల్సిన దుస్థితి ఏర్పడింది.. రూ.కోట్ల విలువచేసే భూములను జాతీయ సంపద పేరుతో మా వద్ద లాక్కున్న సింగరేణికి మాపై దయలేకపోగా పొమ్మనకుండా పొగబెడుతున్నారు.. దేశం కోసం భూములిచ్చి నేడు కనిపించని రోగాలతో చస్తున్నాం..' అంటూ సత్తుపల్లి మండలం కిష్టారం గ్రామవాసులు ఆవేదన చెందారు. కిష్టారంలోని సైలో బంకర్ సమీపంలో గత ఐదు రోజులుగా సుమారు 500 మంది గ్రామస్థులు రిలే నిరాహార దీక్షలను నిర్వహిస్తున్నారు. నిరసన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గ్రామంలోని అంబేద్కర్ నగర్, బీసీ కాలనీ వాసులు సుమారు 300మంది జాతీయ రహదారిపైకి చేరుకుని అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. సైలోబంకర్‌ను తొలగించే వరకు తమ ఆందోళన కొనసాగుతుందని భీష్మించుకు కూర్చున్నారు.

ఊరు పుట్టినప్పటి నుంచి కల్మషం లేకుండా జీవిస్తున్నామని, కానీ నేడు కాలుష్యం కోరల్లో ఇరుక్కున్నామని, అనారోగ్యంతో మంచాన పడితే పట్టించునే వారే లేరంటూ కన్నీళ్ల పర్యంతమయ్యారు. సింగరేణి సంస్థ కంటితుడుపు చర్యగా వైద్య శిబిరాలు చేపడుతున్నదే తప్ప తమ ఆరోగ్యాన్ని కాపాడే శాశ్వత పరిష్కారం చూపడం లేదని, తమకు పునరావాసం కల్పిస్తే ఇక్కడి నుంచి వెళ్లిపోతామని గ్రామస్థులంతా ముక్తకంఠంతో నినాదాలు చేశారు. గ్రామస్థుల ఆందోళనకు సీపీఎం నాయకులు మద్దతు తెలిపి పాల్గొన్నారు.

గ్రామానికి 90మీటర్ల దూరంలోనే సైలోబంకర్‌ను నిబంధనలను తుంగలో తొక్కి నిర్మించారని, బొగ్గు మసి గ్రామంపైకి వస్తుండటంతో అనారోగ్యం పాలవుతున్నామని, సింగరేణి సంస్థ పట్టించుకోకపోగా సైలోబంకర్ వద్ద పనులను కొనసాగిస్తున్నదని, వెంటనే తొలగించాలని శీలం సత్యనారాయణరెడ్డి, జాజిరి శ్రీనివాసరావు, రావుల రాజబాబు, కొలికపోగు సర్వేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అరగంట పాటు రాస్తారోకో

సుమారు అరగంట పాటు కిష్టారంలోని జాతీయ రహదారిపై కిలోమీటర్లు ఇరువైపులా ట్రాఫిక్ స్తంభించింది. గ్రామస్థులంతా రోడ్డుపైనే అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. సంఘటనా స్థలానికి పట్టణ సీఐ టీ.కిరణ్, ఎస్‌ఐలు కవిత, వీరేందర్, సిబ్బంది అక్కడికి చేరుకుని రాస్తారోకోను అడ్డుకునే ప్రయత్నం చేశారు. జీఎం వచ్చే వరకు ఆందోళన విరమించేది లేదనడంతో ఆయనతో ఆందోళనకారులు ఫోన్‌లో మాట్లాడిన తర్వాత రాస్తారోకోను నిలిపివేయడంతో పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. కిష్టారం ఓసీ పీవో ఎంవీ.నరసింహారావు చేరుకుని సింగరేణి సంస్థ మీకు శాశ్వత పరిష్కారం చూపుతుందని, అప్పటి వరకు సంస్థ పనులను అడ్డుకోవద్దని గ్రామస్థులను కోరారు.


బంగారు భవితకు ప్రేరణ

- గిరి విద్యాసంస్థల్లో కెరియర్ గైడెన్స్ ఆన్‌వాల్
- విద్యా, ఉద్యోగ సమాచారంతో ఫెక్సీలు

భద్రాచలం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యాసంస్థల్లో విద్యనభ్యసించే గిరి బిడ్డల బంగారు భవితకు కెరియర్ గైడెన్స్ ఆన్ వాల్ పేరుతో విద్య, ఉద్యోగ సమాచారాన్ని వారికి తెలిసేవిధంగా భద్రాచలం ఐటీడీఏ పీవో బి. రాహుల్ చర్యలు చేపట్టారు. ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ, గురుకులాలలో చదివే విద్యార్థులకు లక్ష్య సాధనను చేరుకునేందుకు వినూత్న రీతిలో పీవో రాహుల్ ప్రేరణ పేరుతో కార్యక మాన్ని రూపొందించారు. ఇందులో వివిధ ప్రభుత్వ శాఖలలో బాధ్యతలు నిర్వహిస్తున్న అధికారులు, ఉద్యోగులను ఆహ్వానించి వారి చేత వారి విజయగాథలను విద్యార్థులకు వినిపించారు. కెరియర్ గైడెన్స్ ఆన్‌వాల్ కార్యక్రమాన్ని అధికారికంగా భద్రాచలంలోని ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఐటీడీఏ పీవో బి. రాహుల్ లాంఛనంగా ప్రారంభించారు.

లక్ష్యాన్ని చేరుకోవటం ఎలా...

గిరిజన విద్యాసంస్థల్లో 8,9,10 తరగతులు చదువుతున్న విద్యార్థులు తాము కలలు కన్న లక్ష్యాన్ని ఏ విధంగా చేరుకోవాలి.. అనే దానిపై అర్థమయ్యే రీతిలో అన్ని విద్యాసంస్థల్లో లక్ష్యాన్ని చేరుకోవటం ఎలా ?, కేంద్ర, రాష్ట్ర ప్ర భుత్వాల పరిధిలోని వివిధ ప్రభుత్వ శాఖలలో ఉన్న ఉద్యోగ అవకాశాలు ఏంటి?, వాటిని ఏ వి ధంగా చేరుకోవాలి?, అందుకు కావలసిన విద్యార్హతలు ఏంటి?, వాటిని చేరుకునేందుకు పరీక్షా విధానం ఏ విధంగా ఉంటుంది?, లాంటి వివరా లు ప్రతి విద్యార్థికి తెలిసేలా ఆ శ్రమ, గురుకుల పాఠశాలలోని అకడమిక్ బ్లాక్‌లలో ఫెక్సీలు ఏర్పాటు చేయాలని ఇప్పటికే పీవో రాహుల్ అధికారులను ఆదేశించారు. ఇదే సమయంలో మండల స్థాయిలో సైతం బృందాలను ఏర్పాటు చేసి విద్యార్థులకు కెరియర్ గైడెన్స్ పై అవగాహన కల్పించనున్నట్లు పీవో రాహుల్ చర్యలు చేపడుతున్నారు.



కెరియర్ గైడెన్స్ ఆన్ వాల్‌ను ఆవిష్కరించిన పీవో, అధికారులు

పీపీపీ విధానం

విద్యార్థులకు పోటీ పరీక్షలు, వార్షిక పరీక్షల సమయంలో ఆందోళన, మానసిక ఒత్తిడి చెందకుండా ప్రతిభా ప్రోత్సాహక పరీక్ష(పీపీపీ)ను ఐటీడీఏ పరిధిలోని గిరిజన విద్యా సంస్థల్లోని విద్యార్థులకు నిర్వహించనున్నారు. ఈ నెల 23న భద్రాచలం, పాల్వంచ, ఇల్లందు, ఖమ్మంలలో పీపీపీ పరీక్షను నిర్వహించనున్నారు. ఆశ్రమ గురుకులాల్లో నిర్వహించే పరీక్షల్లో తొలి ఐదుస్థానాల్లో నిలిచిన విద్యార్థులను ప్రతి పాఠశాల నుంచి ఎంపిక చేయనున్నారు. ఇందులో ప్రతి భ చాటిన వారికి వారి భవిష్యత్తు చదువులకు ఉపయోగపడే పుస్తకాలను అందించనున్నారు.

సీఎంపీఎఫ్‌లో అక్రమాలపై సీబీఐ విచారణ జరపాలి

బీఎంఎస్ బొగ్గుపరిశ్రమ ఇన్‌చార్జ్ కొత్తకాపు లక్ష్మారెడ్డి

ఇల్లెందు ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): బొగ్గుపరిశ్రమ కార్మికుల పెన్షన్ ఫండ్(సీఎంపీఎఫ్)లో జరిగిన అవినీతి అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలని అఖిల భారత ఖదాన్ మంజ్దూర్ సంఘ(ఏబీకేఎంఎస్) జాతీయ మహాసభ డిమాండ్ చేసింది. ఫిబ్రవరి 12, 13 తేదీల్లో నాగపూర్‌లో జరిగిన 19వ జాతీయ మహాసభ తీర్మానాలను బీఎంఎస్ బొగ్గగనులశాఖ ఇన్‌చార్జీ కొత్తకాపు లక్ష్మారెడ్డి శుక్రవారం విడుదల చేశారు. బొగ్గగనుల్లో కార్మికుల సంక్షేమం, భద్రాతా చర్యలకు కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. సీఎంపీఎఫ్ ట్రస్ట్ అధికారులు నాన్ కన్వర్టబుల్ డిబెంచర్లుగారూ 1390.25 కోట్లు ప్రవేటు సంస్థలకు పెట్టుబడులు పెట్టారని, అది దివాళా తీశాయన్నారు. అందుకు అధికారుల నిర్లక్ష్యం, అవినీతి కారణమని ఆరోపించారు. బొగుగని కార్మికులు తీవ్రంగా నష్ట పోయారని బాధ్యులైన అధికారులను శిక్షించేందుకు సీబీఐ విచారణ జరిపించాలని తీర్మానించారు. మైనింగ్ సెఫ్టీ నిబంధనలు సంక్రమంగా అమలు చేయడం లేదని, ప్రమాదరహిత బొగ్గఉత్పత్తి పెరిగేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. బొగ్గ ఉత్పత్తిని పెంచేందుకు అండర్‌గ్రౌడ్ బొగ్గ గనుల తవ్వకాలను పెంచాలని మహాసభ కేంద్ర ప్రభుత్వానికి విన్నవించిందని చెప్పారు.

పాలేరు నదిలోకి ఎస్ఆర్ఎస్పీ జలాలు



పూజలు చేస్తున్న నరేష్‌రెడ్డి

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ద్వారా వస్తున్న సాగునీటిని శుక్రవారం మండలంలోని ముజాహిద్‌పురం సమీపంలోని పాలేరు ఏటిలోకి విడుదల చేశారు. ఈకార్యక్రమాన్ని జిల్లా కాంగ్రెస్ నాయకులు రామసహాయం నరేష్‌రెడ్డి నీటిని విడుదల చేశారు. గంగంమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాలేరు ఏటిలో పూర్తిస్థాయిలో నీటిమట్టం ఎండిపోయింది. రైతులు పంటలు సాగుచేయడానికి ఇబ్బందిగా ఉండడంతో పరిసర ప్రాతాల రైతులు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. సంబందిత నీటిపారుదలశాఖ అధికారులతో మాట్లాడి ఎస్ఆర్ఎస్పీ జలాలు పాలేరు ఏటిలోకి వచ్చేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దీంతో అధికారులు మహబూబాబాద్ జిల్లా మాటేడు చెరువునుంచి పాలేరు ఏటిలోకి వచ్చేలా ప్రత్యేక కాలవలు తవ్వినీటిని వచ్చేలా పనులు చేపట్టారు శుక్రవారం నీటిని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుమన్‌రెడ్డి, రవికాంఒత్‌రెడ్డి, ఫుల్లారి యాకమ్మ పాల్గొన్నారు.

16 గొర్రెల మృత్యువాత

ఖమ్మంరూరల్, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో 16 గొర్రెలు మృతి చెందిన సంఘటన ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ఆటోనగర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. గుర్రాలపాడు గ్రామానికి చెందిన గొర్రెల కాపరులు బుర్ర వెంకన్న, దొడ్డ ఉపేందర్, వీరభద్రమ్ పదేళ్లుగా గొర్రెల పెంపకంతో జీవనం సాగిస్తున్నారు. రోజువారిలో భాగంగా గొర్రెలను మేతకు తోలుకెళ్లారు. ఆటోనగర్ ప్రాంతంలో గొర్రెలు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాయి. వాటివిలువ సుమారు రూ.2లక్షలపైగా ఉంటుందని తెలిపారు. జరిగిన ఘటనపై గొర్రెల కాపరులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దివ్యాంగులకు దారులు

- షాపింగ్ మాల్స్ నుంచి బార్లు వరకు నోటీసులు
- 110 విద్యా,వ్యాపార, మాల్స్,అపార్టుమెంట్లు గుర్తింపు
- నోటీసులు అందజేస్తున్న కేఎంసీ అధికారులు

ఖమ్మంసంక్షేమ విభాగం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): విద్యా, వ్యాపార, వాణిజ్య సంస్థల్లోకి దివ్యాంగులు వెళ్లేందుకు ప్రత్యేక ర్యాంపులు ఏర్పాటు చేయాలని కేఎంసీ అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. రాష్ట్రంలో ఖమ్మం నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. అయితే ఆయా షాపింగ్ మాల్స్, దుకాణాలు నిబంధనల మేరకు నిర్మాణాలు జరగటం లేదు. దీంతో దివ్యాంగులు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో షాపింగ్ మాల్స్ నుంచి వైన్స్ వరకు దివ్యాంగులకు దారులు వేసేందుకు కేఎంసీ అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు.

ఇటీవల సర్వే

ఖమ్మంనగరంలో విద్యా, వ్యాపార, వాణిజ్య సంస్థలు, షాపింగ్‌మాల్స్‌అపార్టుమెంట్లు,బార్లు,రెస్టారెంట్లు, ఫంక్షన్‌హాల్స్ విస్తరిస్తున్నాయి. వీటిలో 98శాతం మేరకు దివ్యాంగులు వచ్చేందుకు ర్యాంపులు నిర్మాణం చేయలేదు. కొద్దిపాటి భవనాలను అద్దెకు తీసుకొని డ్రెయినేజీలు ఆక్రమించి బహుళఅంతస్తులు, వ్యాపార దుకాణాలు,మాల్స్‌నిర్మాణాలు జరిపారు. దీంతో కేఎంసీ అధికారులు ఇటీవల సర్వే నిర్వహించారు. వీటిలో విద్యాసంస్థలు, వస్త్ర,బంగారం, రెస్టారెంట్లు, బార్లు, వైన్స్, హోటల్స్ ఇతర వ్యాపార సంస్థలు ఉన్నాయి.



నోటీసులు జారీ చేస్తున్న కేఎంసీ బృందాలు

110 బహుళ అంతస్థులకు నోటీసులు

ఖమ్మం నగరంలో 110 వ్యాపార బహుళ అంతస్థుల భవనాలను కేఎంసీ అధికారులు గుర్తించారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ప్రత్యేక పర్యవేక్షణతో సుప్రీంకోర్టు పీడబ్ల్యూడీ యాక్టుతో పాటుగా దివ్యాంగుల చట్టాలను ఖమ్మం నగర పాలక సంస్థ అధికారులు అమలు చేస్తున్నారు. శుక్రవారం నుంచి ఖమ్మంలో వారం పాటు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఇందుకోసం పట్టణ ప్రణాళిక టీపీఎస్ అధికారులు నరేశ్, సంతోష్, సతీష్, తేజా ఆధ్వర్యంలో నాల్గు బృందాలను కేటాయించారు. ఒక్కో బృందంలో నల్గురు ఉద్యోగులను కేటాయించారు. దివ్యాంగులకు ర్యాంపులు లేని భవనాలను గుర్తించటం. అక్కడ 1:12 నిష్పత్తిలో ర్యాంపులు ఏర్పాటు చేసేందుకు ఆదేశాలు ఇవ్వటం వారం రోజుల్లోగా ర్యాంపులు నిర్మాణం చేసేలా చర్యలు తీసుకోవటంపై కార్యచరణ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ కేఎంసీలో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. నాల్గు బృందాలను ఏర్పాటు చేసి నోడల్ ఆఫీసర్‌గా పట్టణ ప్రణాళిక అధికారి వసుందర, పర్యవేక్షణా బాధ్యతలను అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్ షఫీ ఉల్లా, ఈఈ కృష్ణలాల్, ఉద్యాన అధికారి రాధికలను కేటాయించారు. దీంతో శుక్రవారం సాయంత్రం నుంచి క్షేత్రస్థాయిలోకి వెళ్లి నోటీసులు జారీ, ర్యాంపుల నిర్మాణాల ఆదేశాలను అమలు ప్రారంభించారు.



ప్రసంగిస్తున్న ఐటీడీఏ పీవో రాహుల్

అంకితభావంతో విధులు నిర్వహించాలి

ఐటీడీఏ పీవో రాహుల్

భద్రాచలం,ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో గిరిజన విద్యా సంస్థల్లో పని చేస్తున్న ప్రతీ ఒక్కరు అంకితభావంతో విధులు నిర్వహించాలని ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. ఇటీవల కాలంలో పలు పాఠశాలల్లో నైట్ స్టడీ అనంతరం ఉపాధ్యాయులు రాత్రిసమయంలో ఉండకుండా ఉదయం వస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఇటువంటి పద్ధతి ఎంత మాత్రం సముచితం కాదని హితవు పలికారు. వెనుకబడిన విద్యార్థులను ఇప్పటికే గుర్తించామని వారు బలహీనంగా ఉన్న అంశాల్లో తగిన శిక్షణ ఇచ్చి ముందుకు తీసుకొచ్చేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జనరల్ డేవిడ్‌రాజు, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు మణెమ్మ, విజయలక్ష్మి, ఆర్సీవో గురుకులం నాగార్జునరావు, ఏసీఎంవో రమణయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వీకే 7 ఓపెన్‌కాస్టును యాజమాన్యమే చేపట్టాలి

హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్

రుద్రంపూర్,(సింగరేణి) ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కొత్తగూడెం ఏరియా వీకే 7 ఓపెన్‌కాస్టులో బొగ్గును సింగేణి యాజమాన్యమే ఉత్పత్తి చేయాలని ది సింగరేణి మైన్స్ అండ్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ (హెచ్ఎంఎస్) రాష్ట్ర హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ డిమాండ్ చేశారు. బొగ్గ ఉత్పత్తిని ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తే ఉద్యమాలు చేపడతామని సింగరేణి యాజమాన్యాన్ని హెచ్చరించారు. శుక్రవారం కొత్తగూడెం ఏరియా జీఎం షాలెం రాజుకు హెచ్ఎంఎస్ ప్రతినిధి బృందం అందజేసింది. సింగరేణి భవిష్యత్ కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వీకే 7 ఓపెన్‌కాస్టు, కిష్టారం ఓపెన్‌కాస్టులో పర్మినెంట్ కార్మికులతో పని చేయించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, నాయకులు ఆసీఫ్, చిట్టిబాబు, అబ్దుల్, సాంబశివరావు,వరానందు, లక్ష్మణ్, కరీం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడల్లో రుద్రంపూర్ విద్యార్థుల ప్రతిభ

చుంచుపల్లి,ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): ఇటీవల హైదారాబాద్‌లో ముగిసిన రాష్ట్రస్థాయి పాలిటెక్నిక్ డిస్ట్రిక్ట్ క్రీడల్లో రుద్రంపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచారు. ఈ పోటీల్లో 100, 200, 400 మీటర్ల పరుగు పందాలలో మొదటి స్థానం, లాంగ్ జంప్ విభాగంలో మొదటి స్థానం, డిస్కస్‌త్రోలో ద్వితీయ స్థానం 400మీటర్ల రిలే పరుగు పందెంలో ద్వితీయ స్థానం, షటిల్ బ్యాడ్మింటన్‌లో బాలుర డబుల్స్ బాయ్స్ విభాగంలో ద్వితీయస్థానం, బ్యాడ్మింటన్ సింగిల్స్ బాలుర విభాగంలో తృతీయస్థానం, షార్ట్‌పుట్ బాలుర విభాగంలో మొదటి స్థానం, బ్యాడ్మింటన్ బాలికల విభాగంలో ద్వితీయ స్థానం సాధించారు. అథ్లెటిక్స్ విభాగంలో జె.దీక్షిత్ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి ఓవరల్ ఛాంపియన్ షిప్ సాధించాడు. ప్రతిభ కనబరిచిన విద్యార్థిని, విద్యార్థులను, ఫిజికల్ డైరెక్టర్ కృష్ణారావును ప్రిన్సిపాల్ బి.శ్రీనివాస్ శుక్రవారం ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు. రుద్రంపూర్ కళాశాలకు చెందిన దీక్షిత్ ఓవరాల్ చాంపియన్‌గా నిలవడం పట్ల భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ కార్యాలయంలో దీక్షిత్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంటివో సుధాకర్‌రావు, కళాశాల పీడి కృష్ణ, జాతీయ క్రీడాకారులు ఎండి. బాబ్జి, అమిత్, కోచ్‌లు డి.సుష్మ, మల్లికార్జున్‌రావు, న్యూస్టార్స్ అథ్లెటిక్స్ క్లబ్ సభ్యులు నాగరాజు, శ్రీనివాస్, వేణు, నరేష్ పాల్గొన్నారు.



దీక్షిత్‌ను అభినందిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

వన దేవతలను దర్శించుకున్న భక్తులు

- నేడువన ప్రవేశం చేయనున్న వనదేవతలు

కరకగూడెం,ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిరుమళ్ల పంచాయతీ చిరుమళ్ల గ్రామంలో జరుగుతున్న సమక్క, సారలమ్మ జాతర మహోత్సవం అత్యంత వైభవంగా జరుగుతుంది. గురువారం వన దేవత గుట్ట నుంచి వన దేవతను సమ్మక్కను పూజారులు అత్యంత భక్తి శ్రద్ధలతో ఆలయం వద్ద గద్దెలపై కొలువు తీర్చారు. రాత్రి 1:30 గంటలకు పూజారులు కున్నుల పండువగా పడిగిద్ద రాజుతో సమ్మక్క తల్లికి కల్యాణ మహోత్సవం జరిపించారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. శుక్రవారం శుంఖుపండుగా సందర్భంగా భక్తులు వనదేవతలకు ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. శనివారం వన దేవతలను వన ప్రవేశం చేయనున్నట్లు ఆలయ పూజారులు తెలిపారు. వన దేవతలు వన ప్రవేశంతో జాతర ముగింపు అవుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.





పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

జూలూరుపాడు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ప్రేమజంట తమకు రక్షణ కల్పించాలని కోరుతూ జూలూరుపాడు పోలీసులను ఆశ్రయించిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకెళితే జూలూరుపాడు మండలంలోని రాజారావుపేట గ్రామానికి చెందిన ఓ యువతి, యువకుడు ఏడాదిగా ప్రేమించుకుంటున్నారు. పెళ్లి చేసుకోవాలని నిశ్చయించుకున్నారు. కులాంతర వివాహం కావడంతో సదరు యువకుడితో పెళ్లి జరపటానికి యువతి కుటుంబ సభ్యులు ఒప్పుకోలేదు. ఇద్దరు మేజర్లు కావడంతో రెండు రోజుల క్రితం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయారు. ఓ గుడిలో వివాహం చేసుకుని ఇద్దరు కలసి జూలూరుపాడు వచ్చి పోలీసులను ఆశ్రయించారు. కుటుంబ సభ్యుల నుంచి తమకు ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలని వారు కోరారు. దీంతో పోలీసులు ఇరు కుటుంబాల సభ్యులకు సమాచారాన్ని అందించడంతో వారు పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. యువతి కుటుంబ సభ్యులు వారిద్దరు కలిసి ఉండేందుకు అంగీకరించలేదు. ఎస్ఐ బాదావత్ రవి ఇరు కుటుంబసభ్యుల సమక్షంలో వారిద్దరికి కౌన్సిలింగ్ నిర్వహించారు. యువతి ప్రేమించిన యువకుడితోనే వెళతానని చెప్పడంతో వారికి ఎలాంటి హానితలపెట్టవద్దని సూచించారు. గ్రామంలో ఎలాంటి వివాదాలు చోటుచేసుకున్నా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఇరు కుటుంబాల సభ్యులకు తెలిపారు.

కోడి పందేల స్థావరంపై పోలీసుల దాడి

చంద్రుగొండ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): చంద్రుగొండ మండల పరిధిలోని దామరచర్ల శివారులో జామాయిల్ తోటలో కోడి పందేలు నిర్వహిస్తున్న ఐదుగురు వ్యక్తులను శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకోగా మరో ఆరుగురు వ్యక్తులు పరారయ్యారు. ఈ ఘటనపై స్థానిక ఏఎస్ఐ పాపారావు తెలిపిన వివరాల ప్రకారం జామాయిల్ తోటలో కొందరు పందాలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఏఎస్ఐ తన సిబ్బందితో వెళ్లి దాడి చేశారు. పట్టుబడ్డ ఐదుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రెండు కోడి పుంజులు, రూ.3 వేలు, ఏడు ద్విచక్రవాహనాలు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పరారైన వారిని అదుపులోకి తీసుకొంటామని ఏఎస్ఐ తెలిపారు.

20న చలో హైదరాబాద్

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని కోరుతూ ఈ నెల 20న చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక రింగ్ సెంటర్‌లో ఆయన మాట్లాడారు.

చిలకలగండి ముత్యాలమ్మకు దిక్కెవరు...?

- అభివృద్ధిని పట్టించుకోని దేవాదాయశాఖ
- జాతర, వేలంపాటలు, హుండీల రూపంలో లక్షల్లో ఆదాయం

అశ్వారావుపేట, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): కోరిన కోర్కెలు తీర్చే ఆలయంగా ప్రసిద్ధి పొందిన చిలకలగండి ముత్యాలమ్మ ఆలయం అధికారుల నిర్లక్ష్యంతో కునారిల్లిపోతుందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. పర్యవేక్షించాల్సిన అధికారి... చిలకలగండి ఆలయంలో పాటు ఇల్లందు, కల్లూరు ఆలయాలతో పాటు సత్తుపల్లి, దమ్మపేట మండలాలలోని పలు ఆలయాలకు ఇన్‌చార్జిగా ఉండటంతో ఆయన పండుగకో పబ్బానికో, వేలంపాటలు, హుండీ లెక్కింపుల సమయంలో దర్శనమిస్తుంటారు. ఆలయ నిర్వహణ గాలికొదిలేసారు. సిబ్బంది తీరు ఇష్టారాజ్యంగా మారి పోయింది.

భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట మండలంలోని అశ్వారావుపేట- భద్రాచలం రహదారిలో వినాయకపురం వద్ద వేంచేసివున్న చిలకలగండి ముత్యాలమ్మ ఆలయాన్ని 2007లో దేవాదాయ ధర్మాదాయ శాఖ స్వాధీనం చేసుకొంది. ఈ ఆలయానికి ఏడాదికి రూ.40 నుంచి రూ.50 లక్షలకుపైగ ఆదాయం వస్తుంది. ఈ ఆదాయం నుంచి దేవాదాయ ధర్మాదాయశాఖ సీజీఎఫ్ పేరిట 5శాతం, కంట్రిబ్యూషన్ పేరిట 12శాతం, ఆడిట్ ఫీజు పేరిట 1.5శాతం సొమ్ములను వసూలు చేస్తుంది.

కాని ఈ పదిహేడేళ్లలో దేవాదాయ ధర్మాదాయ శాఖ నుంచి ఆలయ అభివృద్ధికి ఒక్క రూపాయి కూడ ఖర్చు పెట్టలేదు. అధికారులు కూడా అతిథులుగా వచ్చి వెళ్లడం తప్ప ఆలయ అభివృద్ధిపై ఏనాడు దృష్టి సారించిన పాపాన పోలేదు. ఇక్కడ పనిచేసే అధికారులు, సిబ్బంది, దుకాణాదారుల మధ్య ఎప్పుడు వివాదం నడుస్తూనే ఉంటుంది. గత నాలుగైదు సంవత్సరాలుగ టెంట్, వాటర్ సప్లై, బొమ్మల దుకాణాలను ఇద్దరు వ్యక్తులే ఏర్పాటు చేసుకున్నారు. వీరికి సిబ్బందికి మధ్య పొసగటక పోవటంతో గత ఏడాది మధ్యలోనే వీరు దుకాణాలను వదిలేసి వెళ్లారు. వేలంలో సొమ్మును పూర్తిగా చెల్లించకుండా మధ్యలోనే వెళ్లిపోయారనే ఆరోపణలు ఉన్నాయి. సుమారు 6 నెలల పాటు తిరిగి దుకాణాలు ఏర్పాటు చేయకపోవడంతో ఆదాయాన్ని కోల్పోయింది. దాతల విరాళాలతో ఆలయ ఆవరణలో నిర్మించిన షెడ్లు నిర్వహణ లేక శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ఓ భక్తుడు ఆలయానికి విరాళంగా ఇచ్చిన మినరల్ వాటర్ ప్లాంటు అడ్రస్ లేకుండా పోయింది. భక్తులు విరాళంగా వచ్చిన బంగారం, వెండి వస్తువులు, ఇతర వస్తువులకు సంబంధించి రికార్డులు ఉన్నాయో లేవో అనే ఆందోళన భక్తుల్లో వ్యక్తం అవుతోంది. జాతర సమయంలో జెయింట్‌వీల్స్ ఇతర వినోద కార్యక్రమాలు ఏర్పాటు సమయంలో ఆలయంకు వచ్చే ఆదాయం కన్న వ్యక్తిగతంగా వచ్చే ఆదాయంపైనే అధికారులు దృష్టి పెడతారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవలే ఈ ఆలయానికి కమిటీ వేసారు. ఇప్పటికైన ప్రభుత్వం ఆలయ అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరుతున్నారు.



చిలకలగండి ముత్యాలమ్మ ఆలయం

ఈవో సూర్యప్రకాశరావు వివరణ..

గత ఏడాది దుకాణాలు ఏర్పాటు చేసిన వారిపై చాలా ఫిర్యాదులు రావడంతో వారిని తప్పించడం జరిగిందని, 6 నెలలు దుకాణాలు లేని మాటవాస్తవమేనని ఈవో సూర్యప్రకాశరావు తెలిపారు. ఇటీవలే టెంట్ హౌస్, బొమ్మల దుకాణం, కొబ్బరి చిప్పలు, కొబ్బరి కాయలు దుకాణాలకు వేలం నిర్వహించడం జరిగిందని ఈఓ సూర్యప్రకాశరావు తెలిపారు. ఆలయ భూమి ఆలయం పేరుతో లేక పోవడంవల్ల దేవాదాయ ధర్మాదాయ శాఖ నిధులు ఇవ్వడానికి ఆటంకంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

మనస్థాపంతో యువకుడి ఆత్మహత్య

పాల్వంచ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి):తాను ప్రేమించిన యువతి తన ప్రేమను తిరస్కరించడంతో మనోవేదనతో యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై పాల్వంచ టౌన్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేసారు. పోలీసుల కథనం ప్రకారం పశ్చిమ బెంగాల్‌కు చెందిన గాలెం(19) తన మేనమామతో కలిసి గత నెలలో పాల్వంచకు మేషన్ పని నిమిత్తం వచ్చారు. స్థానిక మైనింగ్ కళాశాల ప్రాంతంలో నివాసముంటూ ఓ కాంట్రాక్టర్ తో జరిగిన ఒప్పందం మేరకు మెడికల్ కళాశాలలో మేషన్ పనులు చేస్తున్నారు. గతంలో గాలెం అతని స్వగ్రామంలో ఓ యువతిని ప్రేమించాడు. కానీ సదరు యువతి అతని ప్రేమను తిరస్కరించింది. దీంతో పాల్వంచకు వచ్చినప్పటినుంచి అతను తన ప్రేమ విఫలమైన విషయంపై మనోవేదనతో ఉన్నాడు. ఈ క్రమంలోనే గురువారం సాయంత్రం క్యాంపు నుంచి ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లాడు. రాత్రి వరకు క్యాంపుకు తిరిగి రాకపోవడంతో అతని ఆచూకీ కోసం అతని మేనమామ రెహ్మాతుల్లా మరి కొంతమందితో కలిసి గాలిస్తుండగా ప్రక్కనే ఉన్న అడవిలో ఓ చెట్టుకు టవల్‌తో ఉరి వేసుకుని కనిపించాడు. దీంతో అతనిని క్రిందకు దించి పరీక్షించగా అప్పటికే గాలెం మృతి చెందాడు. నిర్ధారణకు వచ్చిన వారు కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి మేనమామ రెహ్మాతుల్లా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్ఐ సుమన్ తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

అశ్వారావుపేట రూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందిన ఘటన అశ్వారావుపేటలో గురువారం రాత్రి జరిగింది. ఎస్ఐ యయాతి రాజు తెలిపిన వివరాల ప్రకారం అశ్వారావుపేటలోని ఇందిరాకాలనీకి చెందిన తానికొండ వెంకటేశ్వర్లు(58) గతనెల 28న రాత్రి జంగారెడ్డిరోడ్‌లో నడుచుకుంటూ వెళుతుండగా లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో గాయపడిన వెంకటేశ్వర్లును కుటుంబసభ్యులు అశ్వారావుపేట, కొత్తగూడెంలో చికిత్స అందించి ఇంటికి తీసుకువచ్చారు. వెంకటేశ్వర్లు గురువారం రాత్రి ఒక్కసారిగా తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించేలోపే వెంకటేశ్వర్లు మృతిచెందాడు. మృతుడి భార్య చిట్టెమ్మ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు.

'గ్రామదీపిక' భూమిలో.. జెండాలు పాతిన డ్వాక్రా మహిళలు

జూలూరుపాడు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరివారిగూడెం గ్రామానికి చెందిన గ్రామదీపిక (వీవోఏ) గరిడి దుర్గారావు డ్వాక్రా మహిళల సొమ్మును స్వాహా చేశాడు. ఈ విషయం గత ఏడాది బయట పడడంతో అప్పట్లో బాధిత డ్వాక్రా మహిళలు పోలీసులకు సైతం ఫిర్యాదు చేశారు. అయినప్పటికి వారికి న్యాయం జరగక పోవడంతో కరివారిగూడెం గ్రామంలో అతనికి చెందిన భూమిలో శుక్రవారం డ్వాక్రా మహిళలు జెండాలు పాతి ఫ్లెక్సిని ఏర్పాటుచేశారు. బాధిత డ్వాక్రా మహిళలు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. కరివారిగూడెం గ్రామానికి చెందిన కరుణా గ్రామ సమాఖ్య పరిధిలోని 8 డ్వాక్రా గ్రూపులకు చెందిన మహిళలు బ్యాంక్ ద్వారా లింకేజి రుణాలను తీసుకున్నారు. కాగా నెలనెల రూణాన్ని బ్యాంక్‌లో చెల్లించాలని సదరు మహిళలు గ్రామదీపికైన దుర్గారావుకు ఇచ్చారు. గ్రామదీపిక వారికి సంబంధించిన రుణాలను 2003 నుంచి బ్యాంక్‌లో జమచేయకుండా స్వాహా చేశాడు. ఈ విషయం గత ఏడాది బయట పడింది. సుమారు రూ.10లక్షలను గ్రామదీపిక స్వాహా చేశాడని వారు తెలిపారు. దీంతో డ్వాక్రా మహిళలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో తనకు సంబంధించిన భూమిని మిట్టపల్లికి చెందిన తన మామకు అమ్మినట్లు తెలపడంతో పాటు, కోర్టులో గత ఏడాది గ్రామదీపిక దుర్గారావు ఐపీ దాఖలు చేసి గ్రామాన్ని విడిచి వెళ్లిపోయాడు. కాగా గత రెండు రోజుల క్రితం మోసపోయిన డ్రాక్రా మహిళలు మీసేవాలో దుర్గారావు భూమికి సంబంధించిన సర్వే నెంబర్‌ను పరిశీలించగా ఇంకా భూమి అతని పేరు మీద ఉన్నట్లు తేలింది. దీంతో 8 గ్రూపులకు చెందిన డ్వాక్రా మహిళలు కరివారిగూడెం గ్రామంలోని దుర్గారావు భూమిలోకి ప్రవేశించి జెండాలను పాతారు. డ్వాక్రా మహిళల నగదును కాజేసినందుకు గాను ఈ భూమిని తాము ఆక్రమించకోవటం జరిగిందని ఫ్లెక్సిని ఏర్పాటుచేశారు. ఇదిలా వుండగా వీవోఏ దుర్గారావు మామ తాను కొనుగోలు చేసిన భూమిలో జెండాలు పాతిన మహిళలపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

క్రైం సమాచారం

అట్రాసిటీ కేసు నిందితుల అరెస్ట్

చింతకాని, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): అట్రాసిటీ కేసులో నిందితులైన ఉమ్మినేని రమేష్, లగడపాటి సాయిలను శుక్రవారం చింతకాని పోలీసులు అరెస్ట్ చేసినట్లు వైరా ఏసీపీ రహమాన్ తెలిపారు. చట్టాన్ని ఉల్లంఘించి అనైతిక కార్యకలాపాలకు, చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడే వారెవరైనా ఉపేక్షించబోమని చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుఉంటామన్నారు. ఎలాంటి ఆరోపణలకు తావు లేకుండా నిష్పాక్షిపాతంగా విచారణ కొనసాగుతుందన్నారు.

బస్సుకు ఎదురు వచ్చిన అడవిదున్న

గుండాల, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): గుండాల అడవుల్లో ఆర్టీసీ బస్సుకు అడవి దున్న ఎదురు వచ్చిన సంఘటన గురువారం జరిగింది. గురువారం సాయంత్రం మణుగూరు ఆర్టీసీ డిపో నుంచి గుండాలకు వస్తున్న ఆర్టీసీ బస్సు గుండాల మండలంలోని దామరతోగు, వెంకటాపురం గ్రామాల మధ్యలోని అడవిలో వస్తున్న బస్సుకు ఒక్కసారిగా అడవిదున్న రోడ్డుపైకి వచ్చి బస్సుకు అడ్డగా నిలిచింది. దాంతో డ్రైవర్ ఎంత హారన్ కొట్టినప్పటికి అడవిదున్న కదలకపోవడంతో ప్రయాణికులు అడవి దున్నను చూసి భయభ్రాంతులకు గురైనారు. ప్రయాణికుల అరుపులు, బస్సు శబ్ధంకు, అడవిదున్న కొద్ది సేపటికి రోడ్డు దిగి అడవిలోకి వెళ్లడంతో ఊపిరి పీల్చుకున్నారు.

టిప్పర్, జేసీబీ పట్టివేత

దమ్మపేట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): అక్రమంగా మట్టి తోలకాలు నిర్వహిస్తున్న టిప్పర్, జేసీబీని రెవెన్యూ అధికారుల పట్టుకున్న ఘటన గట్టుగూడెం గ్రామసమీపంలో జరిగింది. ఎలాంటి అనుమతులు లేకుండా టిప్పర్‌లో జేసీబీ ద్వారా మట్టిని తరలిస్తుండగా సమాచారం మేరకు రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

అశ్వారావుపేట రూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని అనంతారం వాగు నుంచి అశ్వారావుపేటకు అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నారు. సమాచారం మేరకు బస్టాండ్ సెంటర్‌లో ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. అనంతరం ట్రాక్టర్‌ను తహసీల్దారు కార్యాలయానికి తరలించారు. ఇందుకు సంబంధించి డ్రైవర్ రాంబాబు, యజమాని సురేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



చెన్నారం సబ్‌స్టేషన్ పరిధిలో నేడు విద్యుత్ కోత

నేలకొండపల్లి,ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని చెన్నారం విద్యుత్ సబ్-స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 2.30 వరకు విద్యుత్ సరఫరాను నిలివేయనున్నట్లు రాజేశ్వరపురం ఏఈ శుక్రవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నారం విద్యుత్ సబ్-స్టేషన్ పరిధిలోని మండ్రాజుపల్లి, జక్కేపల్లి ఫీడర్లకు విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్లు తెలిపారు. 33కేవి విద్యుత్ లైనుకు మరమ్మతులు చేయిస్తున్న కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఏఈ ప్రకటనలో కోరారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	16 రూ.
వంకాయ	24
గుత్తి వంకాయ	30
బీరకాయ	48
పచ్చిమిర్చి	24
బెండకాయ	38
బెండకాయ	44
పొట్లకాయ	38
దోసకాయ	38-40
చిక్కుడు	44
నాటుచిక్కుడు	80
గోరుచిక్కుడు	44
క్యాబేజీ	20
దొండ	24-30
సొరకాయ	18
క్యారెట్	24
క్యాప్సికం	54
ఆలుగడ్డ	28
ఉల్లిగడ్డ	40-45
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	150
కొత్తిమీర కట్ట	10

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

CINEMA సినిమా

నగరంలో చిత్రాలు..

వినోద:	తండేల్
శ్రీనివాస:	డాకూ మహారాజ్
సాయిరాం:	పట్టుదల
కేపీఎస్:	ఒక పథకం ప్రకారం
తిరుమల:	సంక్రాంతికి వస్తున్నాం
సినీగెలాక్సీ:	డియర్ కృష్ణా

గాడి తప్పుతున్న గ్రామీణాభివృద్ధిశాఖ

- ఒకే ఉద్యోగికి రెండు వేతనాలు
- వీవోఏల నుంచి అదనపు పీడీ వరకు ఇదే తీరు
- ఒక వైపు విచారణలు ఎదుర్కొంటున్నా మారని తీరు



ఖమ్మంసంక్షేమవిభాగం, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తెలుగు రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా గుర్తింపు పొందిన జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ ఏడాదిగా గాడి తప్పిందనే విమర్శలు వెలువడుతున్నాయి. గ్రామ దీపికల నుంచి అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ వరకు కూడా ద్విపాత్రాభినయం చేస్తున్న ఉద్యోగులు, అధికారుల సంఖ్య పెరిగింది. ఒక విభాగంలో ఉద్యోగులు నిర్వహించాల్సిన ఫైల్స్ నిర్వాహణ మరో విభాగం ఉద్యోగుల జోక్యం పెరిగింది. వరసగా జరుగుతున్న ఆడిట్ జనరల్ ఆడిట్ తలనొప్పిగా మారాయి. ఒక వైపు లోకాయుక్త కేసులను ఎదుర్కొని వరస సస్పెన్షన్ వేటు పడుతున్నా మరో వైపు అధికారుల తీరు మారటం లేదని విమర్శలు వెలువడుతున్నాయి.

తిరుమలాయపాలెం మండలంలో నలుగురు సస్పెన్షన్

తిరుమలాయపాలెం మండలం బీరోలు గ్రామదీపిక(వీవోఏ)గా కల్పన పనిచేస్తూ అదనంగా కేంద్ర ప్రభుత్వ అనుభంద ఫార్మర్ ప్రొక్యూర్‌మెంట్ కంపెనీ సీఈవోగా నాల్గు నెలల పాటు బాధ్యతలు నిర్వహించారు. ఒకే సమయంలో రెండు వేతనాలు పొందారు. ఈ విషయంలో సెర్ప్‌లో జిల్లా స్థాయిలో చర్చనీయాంశంగా మారింది. దీంతో గ్రామస్థులతో పాటుగా ఒక వ్యక్తి ఆర్‌టీఏలో వివరాలు తీసుకొని లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. దీంతో అనేక విచారణలు అనంతరం జిల్లా అధికారులకు ఆదేశాలు రావటంతో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ ఆదేశాల మేరకు విచారణ చేపట్టారు. ఒకే సమయంలో రెండు వేతనాలు పొందారనే నిరూపణ కావటంతో గురువారం తిరుమలాయపాలెం ఏపీఎం అలివేలు మంగతో పాటుగా సీసీలు జైపాల్, దేవసుందరం, రేణుకాను సస్పెన్షన్ వేటు వేశారు. ఈ సంఘటన జిల్లా సెర్ప్‌లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కేవలం కోర్టు కేసు తీర్పు ఉపశమనం కోసం సస్పెన్షన్ వేటు వేశారా.. లేదా పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటారా.. అని జిల్లా గ్రామీణాభివృద్ధిలో చర్చ జరుగుతుంది.

సింగరేణి ఏపీవోకు డీఆర్‌డీఏ ఓఎస్‌డీగా నియామకం

జిల్లాలోని గిరిజన మండలాల్లో సింగరేణి(కారేపల్లి) మండలం 98శాతం గిరిజన జనాభా నివాసం ఉంటారు. అయితే ఇక్కడ ఉపాధి హామీ పనులు పర్యవేక్షణ చేయాల్సిన ఏపీవో అజయ్‌ను 8నెలలుగా ఖమ్మం డీఆర్‌డీఏ కార్యాలయంలో డీఆర్డీవోకు ఓఎస్‌డీ(ఆఫీసర్ ఇన్ స్పెషల్ డ్యూటీ)గా బాధ్యతలు కేటాయించారు. నిబంధనల మేరకు ఐఏఎస్, ఐపీఎస్ స్థాయి అధికారులకు మాత్రమే ఓఎస్‌డీ విభాగంలో సహాయ ఉద్యోగుల నియామకం ఉంటుంది. సింగరేణి మండలంలో రెగ్యులర్ ఏపీవో లేక పోవటంతో అక్కడ గిరిజనులకు సరైన ఉపాధి అవకాశాలు, కార్యచరణ చేసే అధికారులు లేక పోవటంతో గిరిజన కూలీలు ఉపాధి కోల్పోతున్నారు. పలు అవినీతి అక్రమాలు జరుగుతున్నాయి.

చింతకాని ఎంపీడీవోగా, అదనపు పీడీగా..

మధిర నియోజకవర్గంలో చింతకాని మండలం ఎంతో కీలకమైనది. ఎక్కువ విస్తీర్ణంతో పాటుగా చైతన్యవంతమైన మండలం. ఇటీవల అక్కడ ఎంపీడీవోగా శ్రీనివాసరావును నియామకం చేశారు. ఇందిర డెయిరీ పాటుగా ఆరు మహిళా గ్యారెంటీ పథకాలను మోడల్‌గా ఇదే మండలంలో కార్యచరణ చేశారు. కాగా ఇక్కడ ఎంపీడీవోకు డీఆర్‌డీఏ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు కేటాయించారు. దీంతో ఎక్కువ సమయం డీఆర్‌డీఏకు ఇతర మండలాల పర్యవేక్షణకు సమయం కేటాయిస్తున్నారు. ఏకకాలంలో అదనపు ప్రాజెక్టు డైరెక్టర్‌గా, చింతకాని ఎంపీడీవోగా హాజరు నమోదుపై ఉద్యోగ సంఘాల్లో చర్చ జరుగుతుంది.

ఏపీవో లేకున్నా ఇబ్బంది లేదు

సన్యాసయ్య, డీఆర్డీవో, ఖమ్మం జిల్లా

తిరుమలాయపాలెం సింగరేణి మండలంలో పనిచేస్తున్న ఏపీవోను కోర్టు కేసుల పర్యవేక్షణకోసం ఓఎస్‌డీగా నియమించాం. సింగరేణి మండలంలో ఏపీవో లేక పోయినా ఎటువంటి ఇబ్బంది లేదు. చింతకాని మండలం ఎంపీడీవోకు అదనపు పీడీగా నియామకం జరిగింది.ఏకకాలంలో రెండు ప్రాంతాల్లో విధులు నిర్వహించినా ఏరోజు ఎక్కడ విధులు నిర్వహిస్తే ఆ రోజు అక్కడ హాజరు నమోదు జరుగుతుంది. సాంకేతికంగా ఎటువంటి ఇబ్బందులు లేవు. కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్ణయాలు తీసుకుంటున్నాం.

21న టీజేఎస్ కమిటీ ఎన్నిక

ఖమ్మంచర్చికాంపౌండ్, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జనసమితి ఆధ్వర్యంలో జిల్లాలోని పార్టీ, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో కమిటీ వేసి నూతన కమిటీని ఎన్నుకోవడం జరుగుతుందని టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

తిరుమలాయపాలెం,ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): మండలంలోని జల్లేపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్‌కు చెందిన 30కుటుంబాలు వారు ఆపార్టీకి రాజీనామాచేసి శుక్రవారం బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసమక్షంలో పార్టీలో చేరారు. ఈకార్యక్రమంలో తిరుమలాయపాలెం, ఖమ్మంరూరల్ మండల అధ్యక్షుడు బాషబోయిన వీరన్న, బెల్లం వేణు, నాయకులు శ్రీనివాసరావు, జగదీష్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): అన్ని పంటలకు మద్దతు ధర కల్పించాలని రైతుసంఘం జిల్లా కార్యదర్శి మాదినేని రమేష్ తెలిపారు.శుక్రవారం తిరుమలాయపాలెంలో రైతుసంఘం జనరల్‌బాడీ సమావేశం పి.సుధాకర్ అధ్యక్షతన జరిగింది. మిర్చిమద్దతు ధర లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. 18న మిర్చి మార్కెట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్టుతెలిపారు.ఈకార్యక్రమంలో టి.నాగేశ్వరావు, బింగి రమేష్, సుధాకర్, స్వామి, వెంకటరెడ్డి కొమ్ము శ్రీను పాల్గొన్నారు.

డిజిటల్ క్రాప్‌సర్వే వేగవంతం చేయాలి

జిల్లా వ్యవసాయాధికారి

సత్తుపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా డిజిటల్ క్రాప్ సర్వే వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య వ్యవసాయ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన సత్తుపల్లిలో ఆకస్మికంగా పర్యటించారు. మండలంలోని రేజర్లలో ని ర్వహిస్తున్న డిజిటల్ క్రాప్ సర్వే ప్రక్రియను తనిఖీ చేశారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం 2,42,267ఎకరాలను లక్ష్యంగా నిర్ధేశించారని, దీనికిగానూ 99,107ఎకరాలను ఇప్పటి వరకు సర్వే పూర్తి చేశామని చెప్పారు. ఈ యాసంగిలో జిల్లా వ్యాప్తంగా ఆయా సహకార సంఘాల పరిధిలో రైతుల అవసరాలకు సరిపడా ఎరువుల నిల్వల ను అందుబాటులో ఉంచామని తెలిపారు. కార్యక్రమంలో సత్తుపల్లి ఏడీఏ వీ.శ్రీనివాస రెడ్డి, ఏవో వై.శ్రీనివాసరావు, ఏఈవో టి.నరేష్, రైతులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి జాతరపై సమీక్ష

వైరా, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్నానాల లక్ష్మీపురంలోని శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 26న జరిగే మహాశివ రాత్రి జా తర, పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవ వేడుకలపై శుక్రవారం ఖమ్మం ఆర్డీవో జి.నర్సింహారావు పలు ప్రభుత్వశాఖల అధికారులతో సమీక్ష సమావేశా న్ని నిర్వహించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, నందిని దంపతులు 26వతేదీ వేకువజామునే పూజలు చేసి రాత్రి పార్వతీ పరమేశ్వరుల కల్యాణ క్ర తువును నిర్వహిస్తారు. ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని అధికారులను ఆర్డీ వో ఆదేశించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ప్రణాళికాబద్దం గా అన్ని ఏర్పాట్లు చేయాలని అందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి పలు సూచనలు చేశారు. మహాశివరాత్రి జాతర ప్రచార వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ ఆలయానికి ఐదెకరాల భూమి కేటాయించాలని కోరుతూ ఆర్డీవోకు గ్రామస్థులు ఒక వినతిపత్రాన్ని అందజేశారు. ఎంపీడీవో సరస్వతీ, డిప్యూటీ త హసీల్దార్ సీహెచ్.సురేష్ బాబు, ఎస్‌ఐ వంశీకృష్ణ భాగ్యరాజ్, ఎంపీవో జ్యోత్స్నాదేవి, పంచాయతీ కార్యదర్శి ఆర్.భారతి, ఈవో హరి చంద్రశేఖర్, వైరా ప్రాజెక్టు క మిటీ మాజీ చైర్మన్ దొడ్డా పుల్లయ్య, ఆలయ మాజీ చైర్మన్‌లు మోరంపూడి బాబూరావు, నూతి వెంకటేశ్వరరావు, మాజీ ఉపసర్పంచ్ మల్లు రామకృష్ణ, ఆగ్రామానికి చెందిన పొట్లపల్లి నాగేశ్వరరావు, అడుసుమల్లి గణేష్, మొగునూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

మండ్రాజుపల్లి సొసైటీ అధ్యక్షుడు

వెంకటరావు రాజీనామా

- సొసైటీ అధ్యక్షులకు, నాయకులకు ఆదర్శంగా నిలిచిన తోట
- జీతంతో పాటు సొంత డబ్బులు గోడౌన్ నిర్మాణానికి విరాళం



మండ్రాజుపల్లి సొసైటీ అధ్యక్షుడు తోట వెంకటరావును సన్మానిస్తున్న డైరెక్టర్లు, రైతులు.

నేలకొండపల్లి, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి): మండ్రాజుపల్లి సహకార సంఘం అధ్యక్షుడు తోట వెంకటరావు శుక్రవారం సాయంత్రం పదవికి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను ఖమ్మండీసీఓకు అందించారు. అంతకు ముందు సొసైటీ కార్యాలయంలో సొసైటీ డైరెక్టర్లు, రైతులతో సమావేశమయ్యారు. రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. 2020లో మండ్రాజుపల్లి సొసైటీ అధ్యక్షుడిగా తోట వెంకటరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పదవీకాలంలో సంఘాన్ని లాభాలబాట పట్టించారు. గౌరవ వేతనాన్ని సైతం తీసుకోకుండా, సొంత డబ్బులు రూ.లక్షను గోడౌను నిర్మాణానికి విరాళంగా ఇచ్చారు. రూ.38వేలు ఖర్చు చేసి సొసైటీ కార్యాలయంలో కప్‌బోర్డులు తయారు చేయించాడు.సీఈఎఫ్ ఫండ్ ద్వారా పాలకవర్గ సమావేశం గదిని నిర్మించారు. 99శాతం రుణాలను వసూలు చేశారు. సొసైటీకి దాదాపుగా రూ.57లక్షల లాభాన్ని తెచ్చారు. పదవీ కాలంలో అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఇప్పటి వరకు చేసిన సేవ సంతృప్తిని ఇచ్చిందని, అందుకే ప్రభుత్వం పదవీకాలాన్ని పొడిగిస్తుందని తెలిసినా తన పదవికి ముందే రాజీనామా చేశానని వెంకటరావు చెప్పారు. వెంకటరావును శుక్రవారం సొసైటీ కార్యాలయంలో సన్మానించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డైరెక్టర్లు, సీఈఓ, రైతులు పాల్గొన్నారు.

ఆర్థిక స్వతంత్రతతోనే మహిళా సాధికారత

- మహిళ స్వయం సహాయక సంఘాల తీరు మారాలి
- డిమాండ్ ఉన్న వ్యాపారాలను ఎంచుకోవాలి
- శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మంసంక్షేమవిభాగం, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఆర్థిక స్వతంత్రం ఉంటే ఆ కుటుంబం ఆర్థికంగా బలపడుతుందని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పేర్కొన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సెర్ప్ ఆధ్వర్యంలో గ్రామీణా మహిళల వ్యాపారం మరియు వ్యవసాయేతర జీవనోపాధుల పెంపుదలపై గ్రామీణ మహిళా వ్యాపారులకు రెండురోజుల శిక్షణ ఇస్తున్నారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ పాల్గొని ప్రసంగించారు. మారుతున్న కాలంతో పాటుగా మహిళాస్వయం సహాయక సంఘాల వ్యాపార విధానాలు మార్పు చెందాలన్నారు. పోటీ ప్రపంచంలో దూసుకుపోవేవిదంగా ఎప్పటికప్పుడు మార్పులను పొందాలన్నారు. మహిళ సంఘాల ఉత్పత్తులను మార్కెటింగ్‌లో ఆకర్షణీయంగా అమ్మకాలు జరిపే విదంగా ప్యాకింగ్ నుంచి రవాణా వరకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. స్థానికంగా డిమాండ్ ఉన్న వ్యాపారాలను మాత్రమే మహిళా సంఘాలు ఎంచుకోవాలని, ఎక్కువ సబ్సిడీ కోసం యూనిట్లు తీసుకొని తర్వాత వాటికి డిమాండ్ లేక పోతే నష్టాలు వస్తాయని హితవు పలికారు. డీఆర్డీవో సన్యాసయ్య, అదనపు పీడీ నూరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో నూతన చాంబర్ల ప్రారంభం



ఖమ్మంకలెక్టరేట్: అధికారులు బాధ్యతాయుతంగా, జవాబుదారితనంతో పని చేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పేర్కొన్నారు.శుక్రవారం కలెక్టరేట్‌లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఆరు రెవెన్యూ విభాగ పర్యవేక్షకుల కోసం ఏర్పాటు చేసిన నూతన ఛాంబర్లను కలెక్టర్ ప్రారంభించారు. ప్రజలు తమ సమస్యలు పరిష్కారానికి కలెక్టరేట్‌కు నమ్మకంతో వస్తారని, వారి పట్ల చిత్తశుద్ధితో పని చేసి సమస్య పరిష్కారానికి కృషి చేయాన్నారు. ఒకవేళ దరఖాస్తు పరిష్కారం మన చేతిలో లేని పక్షంలో ఆ సమస్యకు ఎలా పరిష్కారం దొరుకుతుందో అవసరమైన సూచనలు అందించాలని అన్నారు. నూతన చాంబర్లను సద్వినియోగం చేసుకుంటూఫైల్స్‌పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఉద్యోగులు ఒత్తిడి లేకుండా పని చేయాలని, అనవసరంగా ఒత్తిడికి గురవుతే మనపని తీరుపై ప్రభావం పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి, జిల్లారెవెన్యూ అధికారి ఏ.పద్మశ్రీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం. రాజేశ్వరి, కలెక్టరేట్ ఏవో. ఎస్.అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలను అమలు చేయాలి

ఖమ్మంరూరల్,ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎన్నికల ముందు హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పాలేరు డివిజన్ కార్యదర్శి వెంకట రామిరెడ్డి డిమాండ్ చేశారు. మండల పరిధిలోని కాచిరాజుగూడెం గ్రామంలో ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 20న చలోహైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అప్పారావు, ఉప్పలయ్య, భాస్కర్, రాంబాబు, వీర్ల లింగయ్య పాల్గొన్నారు.

మహిళా సంఘం ఏర్పాటుకు మోకాలడ్డు!

- ఖమ్మం 3వ డివిజన్ బల్లేపల్లిలో ఘటన
- డీఎంసీకి సమస్యను వివరించిన మాజీ జడ్పీటీసీ హైమావతి



ఖమ్మంసంక్షేమవిభాగం, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి): మహిళ స్వయం సహాయక సంఘాల సభ్యులుగా చేరుతామని ముందుకొచ్చినా.. బల్లేపల్లి ఆర్పీ మోకాలడ్డుతుండటం చర్చనీయాంశంగా మారింది.. పెరుగుతున్న జనాభాకు తగిన విధంగా మహిళ స్వయం సహాయక సంఘాల సభ్యులను గుర్తించి సంఘాల్ని ఏర్పాటు చేయాలని ఒక వైపు మెప్మా అధికారులు ఆర్పీలు, సీవోలకు ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించి ఆదేశాలిస్తున్నారు. కాగా మరో వైపు మమ్మల్ని సభ్యులుగా చేర్చుకోండి అంటూ మహిళలు ముందుకు వచ్చినా కూడా ఫలితం లేకుండా పోయింది. సంఘాలు ఏర్పాటు చేయకుండా బ్యాంకుల వద్ద బ్యాంకు ఖాతాలు నమోదుకు వెళ్లిన వారిని సైతం వెనక్కి పంపటంతో సంఘాల ఏర్పాటులో కిరికిరి ఏర్పడింది. 3వ డివిజన్ బల్లేపల్లిలో మహిళ స్వయం సహాయక సంఘంలో చేరేందుకు మహిళలు ముందుకు వచ్చారు. స్థానిక ఆర్పీ ముందుకు రాలేదు. దీంతో గాంధీచౌక్‌లో ఉన్న మరోఆర్పీ మహిళలను సంఘం ఏర్పాటుకు సభ్యుల్ని బ్యాంకుకు తీసుకెళ్లారు. దీంతో బల్లేపల్లి ఆర్పీ అడ్డగించారు. మహిళలు బల్లేపల్లి మాజీసర్పంచి,మాజీజెడ్పీటీసీ మలీదు హైమావతిని సంప్రదించారు. ఆమె కేఎంసీకి వెళ్లి మెప్మా డీఎంసీ సుజాతతో మాట్లాడారు. మహిళ స్వయంసహాయక సంఘాన్ని ఏర్పాటు చేసి మహిళలకు సహకరించాలని కోరారు.

ఐదు కిలోల కణితి తొలగింపు

ఖమ్మంకలెక్టరేట్,ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): ఓ మహిళ కడుపునుంచి ఐదు కిలోల కణితిని తొలగించారు.జిల్లా ఆస్పత్రి సూపరిన్‌టెండెంట్ ఎల్ కిరణ్‌కుమార్, ఆర్ఎంవో డాక్టర్ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం కోదాడకు చెందిన సుశీల తీవ్ర కడుపునొప్పితో రెండు వారాల క్రితం పరీక్షల కోసం వచ్చింది. ఆమె కడుపులో కణితి ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. గురువారం వైద్యులు యామిని, అపర్ణ, రాధిక, శ్రీవిద్య, రిక్షిక ఆపరేషన్‌ను నిర్వహించారు. ఆమె కడుపు నుంచి ఐదు కిలోల కణితిని తొలగించారు. కొన్నేళ్లుగా పడుతున్న ఇబ్బందుల నుంచి విముక్తి కలిగించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల కరపత్రాల ఆవిష్కరణ

ఖమ్మంబైపాస్‌రోడ్, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి):వరంగల్,ఖమ్మం,నల్గొండ ఎమ్మెల్సీ ఎన్నికల బీజేపీ అభ్యర్థి కరపత్రాలను పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం టుటౌన్ అధ్యక్షుడు వెంకటనారాయణ యాదవ్ ఆధ్వర్యంలో కరపత్రాలు ఆవిష్కరించారు. ఎమ్మెల్సీగా టీయూఎస్ మద్దతుతో పోటీ చేస్తున్న పులి సరోత్తమరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని విన్నవించారు. ఈకార్యక్రమంలో రుద్రగానిమాదవగౌడ్, మహేందర్‌సింగ్, రవిగౌడ్,అప్పారావు, యుగంధర్, కృష్ణాచారి, కార్తీక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

నిత్యావసరాల పంపిణీ

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాకాసి తండా వాసులకు యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాదు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రాకాసితండా వాసులు మొత్తం 33 కుటుంబాలకు బియ్యం, నిత్యావసరాలు, తోపుడుబడ్లు, కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ప్రతీ ఒక్కరూ పేదలకు సాయం చేయాలని, మానవతా దృక్పథంలో ముందుకు రావాలన్నారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీడీవో సిలార్‌సాబ్ ఎస్‌ఐ2రామలింగారెడ్డి, సంస్థ నిర్వాహకులు మెరగు భరత్‌కుమార్, కందూరి రాములు, సూర్యప్రసాద్ పాల్గొన్నారు.



రాకాసితండా వాసులకు సరుకులు పంపిణీ

ఉచిత కంటి పరీక్షల విజయవంతం



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఖమ్మంచర్చికాంపౌండ్, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బాలాజీ ఎస్టేట్స్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. శుక్రవారం నగరంలోని బాలాజీ ఎస్టేట్ కార్యాలయంలో నిర్వహించిన ఈ ఉచిత కంటి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా బాలాజీ ఎస్టేట్ అధినేత వత్సవాయి రవి మాట్లాడుతూ 40ఏళ్ల వయస్సు దాటిన తర్వాత ఏడాదికోసారి కంటి వైద్యపరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. ఏవిటమిన్ కలిగిన ఆహారం ఎక్కువగా తీసుకోవాలన్నారు. ఈవైద్యశిబిరంలో 400మంది కంటి పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్ పరీక్షలు కూడా ఉచింతంగా నిర్వహించారు.



ఉద్యాన పంటల పెంపుపై రైతులకు అవగాహన

ఎర్రుపాలెం, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): మండలలోని లక్ష్మీపురం గ్రామంలో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఉద్యాన పంటలపై శుక్రవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉద్యాన పంటలలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. మామిడి సాగులో పిందే దశనుంచి పాటించాల్సిన పద్ధతులను కృషివిజ్ఞాన కేంద్రం ఉద్యానశాస్త్రవేత్త డాక్టర్ వి.చైతన్య వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి మదుసూధన్, జిల్లా పట్టుపురు గుల శాఖ అధికారి ముత్యాలు, మధిర మండల ఉద్యానశాఖ అధికారి విష్ణు, మండల ఏవో సాయిశివ, కృషివిజ్ఞాన కేంద్ర ప్రోగ్రాంకో ఆర్డినేటర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహాకావడి ఉత్సవం



కావడి మోస్తున్న భక్తులు

ఏన్కూరు, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): మండలంలోని బురదరాఘవాపురం గ్రామంలో కాశీవిశ్వేశ్వర స్వామి శివాలయం, ప్రాంగణంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం పాలకావిడి మహోత్సవం వైభవంగా నిర్వహించారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి 8వ వార్షికోత్సవం సందర్భంగా కావిడి ఉత్సవాన్ని నిర్వహించారు. ఉదయం 7గంటలకు సుమారు 250మంది భక్తులు సంప్రదాయ దుస్తులను ధరించి పాలకావిడిని భుజాని వేసుకని భాజాబజంత్రీలతో గ్రామంలో ఊరేగింపుగా శోభాయాత్ర నిర్వహించారు. స్వామి వారికి పంచామృతిభాషేక కార్యక్రమాలు నిర్వహించారు. కుజదోష నివారణ, కాలసర్ప దోషనివారణ, ఆరోగ్య ప్రదాయక, కన్యలకు సత్వర వివాహం సిద్ధి, కలగాలని హోమం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి స్వామివారి కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు మాదిరాజు శ్రీనివాసరావు, దెందుకూరి సీతారామచంద్రరావు పాల్గొన్నారు.

మహాశివరాత్రి జాతరపై సమీక్ష

వైరా, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్నానాల లక్ష్మీపురంలోని శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 26న జరిగే మహాశివరాత్రి జాతర, పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవ వేడుకలపై శుక్రవారం ఖమ్మం ఆర్డీవో జి.నర్సింహారావు పలు ప్రభుత్వశాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, నందిని దంపతులు 26వతేదీ వేకువజామునే పూజలు చేసి రాత్రి పార్వతీ పరమేశ్వరుల కల్యాణ క్రతువును నిర్వహిస్తారు. ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని అధికారులను ఆర్డీవో ఆదేశించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ప్రణాళికాబద్ధంగా అన్ని ఏర్పాట్లు చేయాలని అందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి పలు సూచనలు చేశారు. మహాశివరాత్రి జాతర ప్రచార వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ ఆలయానికి ఐదెకరాల భూమి కేటాయించాలని కోరుతూ ఆర్డీవోకు గ్రామస్థులు ఒక వినతిపత్రాన్ని అందజేశారు. ఎంపీడీవో సరస్వతీ, డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్.సురేష్‌బాబు, ఎస్ఐ వంశీకృష్ణ భాగ్యరాజ్, ఎంపీవో జ్యోత్స్నదేవి, పంచాయతీ కార్యదర్శి ఆర్.భారతి, ఈవో హరి చంద్రశేఖర్, వైరా ప్రాజెక్టు కమిటీ మాజీ ఛైర్మన్ దొడ్డా పుల్లయ్య, ఆలయ మాజీ ఛైర్మన్‌లు మోరంపూడి బాబూరావు, నూతి వెంకటేశ్వరరావు, మాజీ ఉపసర్పంచ్ మల్లు రామకృష్ణ, ఆగ్రామానికి చెందిన పొట్లపల్లి నాగేశ్వరరావు, అడుసుమల్లి గణేష్, మొగునూరి సత్యనారాయణ, గిరిగాని శ్రీనివాసరావు, తలారి నర్సింహారావు, సంగెపు రామకృష్ణ, సుల్తాన్ పద్మ, ఆర్టీసీ, ఎక్సైజ్, వైద్యశాఖల అధికారులు పాల్గొన్నారు.

రోడ్ల వెంట ఆక్రమణల తొలగింపు



రేకుల షెడ్డును తొలగిస్తున్న దృశ్యం

వైరా, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీలోని ప్రధాన రహదారులకు రెండువైపులా ఉన్న తాత్కాలిక ఆక్రమణలను మునిసిపల్ సిబ్బంది తొలగిస్తున్నారు. మునిసిపల్ స్పెషలాఫీసర్ అయిన అదనపు కలెక్టర్ శ్రీజ ఆదేశాల మేరకు కమిషనర్ చింతా వేణు పర్యవేక్షణలో ఈ ఆక్రమణలను తొలగించే ప్రక్రియ కొనసాగుతుంది. రోడ్ల పక్కన జీవనోపాధి పొందుతున్న తోపుడుబండ్లు, చిరువ్యాపారుల తాత్కాలిక వ్యాపార సముదాయాలను తొలగించారు. అయితే ఆర్‌అండ్‌బీ, నీటిపారుదలశాఖ, మునిసిపల్ ఇతరశాఖలకు చెందిన స్థలాలను ఆక్రమించి శాశ్వత నిర్మాణాలు చేసిన భవనాలను మాత్రం తొలగించకుండా జీవనోపాధి పొందుతున్న పేదలు, చిరువ్యాపారులకు చెందిన వాటినే నిర్దాక్షిణ్యంగా తొలగించటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. డ్రెయినేజీలపై శాశ్వతంగా నిర్మించిన మెట్లు, జనరేటర్లు తొలగించకుండా కొందరిపైనే మునిసిపాలిటీ వారు తమ ప్రతాపాన్ని చూపించటంపై పలువురు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ముందుగా అక్రమంగా ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మించిన భవనాలు, మెట్లు తొలగించి ఆతర్వాత చిరువ్యాపారులకు చెందిన దుకాణాలు, తోపుడుబండ్లను తొలగిస్తే ఎవరికి అభ్యంతరం ఉండదని అందుకు భిన్నంగా బడా ఆక్రమణదారులను వదిలేసి జీవనోపాధి పొందుతున్న వారిపైనే తమ ప్రతాపం చూపడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా మునిసిపల్ అధికారులు సమన్యాయం పాటించాలని కోరుతున్నారు.

సాగునీటి కోసం రైతుల ఆందోళన

క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ కరువు

పొట్ట దశలో ఉన్న వరికి నీటి ఎద్దడి

లింగాల మేజర్ కాల్వను పరిశీలించిన అధికారులు



రైతుల సమక్షంలో అధికారుల వాగ్వాదం

కల్లూరు, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి): జలవనరులశాఖ కల్లూరు డివిజన్ మధిర బ్రాంచి కెనాల్ పరిధిలో యాసంగిలో సాగు చేసిన వరి పైరు పొట్ట దశకు రాగా గత వారం రోజుల నుంచి సాగునీరు అందని పరిస్థితి. దీంతో లింగాల, వాచ్యానాయక్‌తండ గ్రామాలకు చెందిన రైతులు శుక్రవారం కల్లూరు జలవనరులశాఖ ఎస్సీ కార్యాలయం ముందు ఆందోళనకు దిగారు. క్షేత్రస్థాయిలో జలనవరులశాఖ అధికారుల పర్యవేక్షణ సక్రమంగా లేనందున సాగునీటి పంపిణీ తీరు సరిగ్గా జరగని పరిస్థితి నెలకొన్నదని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. వార బంది పద్ధతిపై సాగర్ నీటి సరఫరా చేస్తున్న దశలో అధికారులు కాల్వలపై నీటి పంపిణీ ఎలా జరగుతుందని కూడ పర్యవేక్షణ చేయకపోటంతో చివరి భూములకు నీరు అందటంలేదని రైతులు తెలిపారు. కంకి పాలు పోసుకునే దశలో ఉన్న వరిపైరు ఎండి పోయే పరిస్థితి ఏర్పడుతుందని లింగాల, వాచ్యానాయక్‌తండ తదితర గ్రామాలకు చెందిన రైతులు చెప్తున్నారు. ఇప్పటికే లింగాల, వాచ్యానాయక్‌తండ గ్రామాల పరిధిలో సుమారు 300 ఎకరాల్లో పొట్టదశలో ఉన్న వరిపైరుకు సాగునీరు అందని పరిస్థితి ఉందని రైతులు తెలిపారు. దీంతో శుక్రవారం ఉదయం పై గ్రామాలకు చెందిన రైతులు బి కాంతరావు, జంజూరి హనుమంతరావు, దేవరపు వెంకటేశ్వరావు తదితరులు ఎస్సీ, ఈఈ కార్యాలయలకు తరలి వచ్చారు. నీటి పంపిణీ సరఫరా తీరు సక్రమంగా జరగటం లేదని ఆయా గ్రామాలకు చెందిన రైతులు ఆందోళనకు దిగారు.

అధికారుల మధ్య వాగ్వాదం..

మధిర బ్రాంచ్ కెనాల్ ద్వారా సాగు నీటి పంపిణీ తీరుపై కల్లూరు ఎస్సీ కార్యాలయంలో రైతుల సమక్షంలో ఎస్సీ వాసంతి ఈఈ లక్ష్మీనారాయణ మధ్య వాగ్వాదం జరిగింది. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో సాగునీటి కోసం రైతులు ఆయా కార్యాలయాలకు వచ్చారు. అదే సమయంలో రైతులు ఈఈ కార్యాలయం నుంచి ఎస్సీ వాసంతి దగ్గరకు విన్నవించుకునేందుకు రాగా స్పందించిన ఎస్సీ తన చాంబర్ వద్దకు ఈఈని పిలిపించారు. నీటి పంపిణీలో ఈఈ స్థాయి నుంచి డీఈ, జెఈల పర్యవేక్షణ సరిగ్గా లేదని ఎస్సీ అన్నారు. ఆయుకట్టు భూములకు సాగునీరు చేరటం లేదని, మీ పర్యవేక్షణ లోపంతో ఇలా జరుగుతందని ఎస్సీ వాసంతి రైతుల సమక్షంలో అనటంతో ఈఈ లక్ష్మినారయణ కోపాద్రిక్తులైనారు. దీంతో వారిద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకొంది. ఒక దశలో ఎస్సీ చాంబర్ కుర్చిలో కూర్చున్న ఈఈ కోపంతో లేచి ఎస్సీపై మండిపడ్డారు. కాల్వలపై శాఖ పరంగా అధికారుల పర్యవేక్షణ సక్రమంగా లేనందున ఈ పరిస్థితి ఏర్పడిందని ఎస్సీ వాసంతి అన్నట్లు తెలిసింది. రైతుల ఫిర్యాదుతో ఎట్టకేలకు ఎస్సీ వాసంతి, ఈఈ లక్ష్మినారాయణ, డీఈ రత్నాకర్ క్షేత్ర స్థాయిలో లింగాల మేజర్ కాల్వను పరిశీలించారు. లింగాల కాల్వ ద్వారా సాగు నీటి సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టారు.

డిజిటల్ క్రాప్ సర్వే వేగవంతం చేయాలి

జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య



సర్వేను పరిశీలిస్తున్న పుల్లయ్య

సత్తుపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా డిజిటల్ క్రాప్ సర్వే వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య వ్యవసాయ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన సత్తుపల్లిలో ఆకస్మికంగా పర్యటించారు. మండలంలోని రేజర్లలో నిర్వహిస్తున్న డిజిటల్ క్రాప్ సర్వే ప్రక్రియను తనిఖీ చేశారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం 2,42,267ఎకరాలను లక్ష్యంగా నిర్దేశించారని, దీనికిగానూ 99,107ఎకరాలను ఇప్పటి వరకు సర్వే పూర్తి చేశామని చెప్పారు. ఈ యాసంగిలో జిల్లా వ్యాప్తంగా ఆయా సహకార సంఘాల పరిధిలో రైతుల అవసరాలకు సరిపడా ఎరువుల నిల్వలను అందుబాటులో ఉంచామని తెలిపారు. కార్యక్రమంలో సత్తుపల్లి ఏడీఏ వీ.శ్రీనివాసరెడ్డి, ఏవో వై.శ్రీనివాసరావు, ఏఈవో టి.నరేష్, రైతులు పాల్గొన్నారు.

కార్మికుల సమ్మె విరమణ



కల్లూరు, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి): వారం రోజుల నుంచి కల్లూరు ఏరియా ఆసుపత్రి కార్మికులకు వేతనల కోసం చేస్తున్న సమ్మెకు ప్రభుత్వం స్పందించింది. దీంతో శుక్రవారం కార్మికులు తమ సమ్మెను విరమించారు. పెండింగ్ వేతనాల సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ. 8 కోట్ల నిధులు విడుదల చేసింది. సమ్మె చేస్తున్న కార్మికుల తరుపున ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు వేము రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికుల పెండింగ్ వేతనాల కోసం నిధులు విడుదల చేయటంతో సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటించారు. ఏఐటియూ సీ తరుపున తాము తలపెట్టిన సమ్మె ఫలితంగా ప్రభుత్వం కార్మికుల వేతనాల నిధులు విడుదల చేయటం జరిగిందని హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ వ్యాప్తంగా ఆసుపత్రి కార్మిలు తపెట్టిన దశల వారి ఆందోళన కార్యక్రమాలను విరమించుకున్నట్లు ఆయన తెలిపారు. కార్మికుల ఆందోళకు సహకరించిన రాష్ట్ర, జిల్లా నాయకులైన తోట రామంజనేయులు, యూసఫ్‌లకు, ప్రభుత్వానికి ఆసుపత్రి కార్మికులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు దమాల దయాకర్, ఆసుపత్రి కార్మికులు కోటేశ్వరి, రంజాన్‌బి, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన

చింతకాని, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఓ కేసు విషయంలో దళితులను పోలీ సులు కొట్టారంటూ చింతకాని పోలీస్ స్టేషన్ ఎదుట దళిత సంఘాలు శుక్ర వారం ఆందోళన నిర్వహించారు. దళిత ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ని యోజకవర్గంలో దళితులపై దాడులను ఖండించారు. దళితులను కొట్టిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ నా యకులు చెరుకుపల్లి నాగేశ్వరరావు, నాగరాజు, విజయ్, నవీన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల కరపత్రాల ఆవిష్కరణ

ఖమ్మంబైపాస్‌రోడ్, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి):వరంగల్,ఖమ్మం,నల్గొండ ఎమ్మెల్సీ ఎన్నికల బీజేపీ అభ్యర్థి కరపత్రాలను పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం టుటౌన్ అధ్యక్షుడు వెంకటనారాయణ యాదవ్ ఆధ్వర్యంలో కరపత్రాలు ఆవిష్కరించారు. ఎమ్మెల్సీగా టీయూఎస్ మద్దతుతో పోటీ చేస్తున్న పులి సరోత్తమరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని విన్నవించారు. ఈకార్యక్రమంలో రుద్రగానిమాదవగౌడ్, మహేందర్‌సింగ్, రవిగౌడ్,అప్పారావు, యుగంధర్, కృష్ణాచారి, కార్తీక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక స్వతంత్రతతోనే మహిళా సాధికారత

» శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మంసంక్షేమవిభాగం, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఆర్థిక స్వతంత్రం ఉంటే ఆ కుటుంబం ఆర్థికంగా బలపడుతుందని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పేర్కొన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సెర్ప్ ఆధ్వర్యంలో గ్రామీణా మహిళల వ్యాపారం మరియు వ్యవసాయేతర జీవనోపాధుల పెంపుదలపై గ్రామీణ మహిళా వ్యాపారులకు రెండురోజుల శిక్షణ ఇస్తున్నారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ పాల్గొని ప్రసంగించారు. మారుతున్న కాలంతో పాటుగా మహిళాస్వయం సహాయక సంఘాల వ్యాపార విధానాలు మార్పు చెందాలన్నారు. పోటీ ప్రపంచంలో దూసుకుపోవేవిదంగా ఎప్పటికప్పుడు మార్పులను పొందాలన్నారు. మహిళ సంఘాల ఉత్పత్తులను మార్కెటింగ్‌లో ఆకర్షణీయంగా అమ్మకాలు జరిపే విదంగా ప్యాకింగ్ నుంచి రవాణా వరకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. స్థానికంగా డిమాండ్ ఉన్న వ్యాపారాలను మాత్రమే మహిళా సంఘాలు ఎంచుకోవాలని, ఎక్కువ సబ్సిడీ కోసం యూనిట్లు తీసుకొని తర్వాత వాటికి డిమాండ్ లేక పోతే నష్టాలు వస్తాయని హితవు పలికారు. డీఆర్డీవో సన్యాసయ్య, అదనపు పీడీ నూరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

గాడి తప్పుతున్న గ్రామీణాభివృద్ధిశాఖ

» ఒకే ఉద్యోగికి రెండు వేతనాలు
» వీవోఏల నుంచి అదనపు పీడీ వరకు ఇదే తీరు
» ఒక వైపు విచారణలు ఎదుర్కొంటున్నా మారని తీరు



ఖమ్మంసంక్షేమవిభాగం, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తెలుగు రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా గుర్తింపు పొందిన జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ ఏడాదిగా గాడి తప్పిందనే విమర్శలు వెలువడుతున్నాయి. గ్రామ దీపికల నుంచి అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ వరకు కూడా ద్వి పాత్రాభినయం చేస్తున్న ఉద్యోగులు, అధికారుల సంఖ్య పెరిగింది. ఒక విభాగంలో ఉద్యోగులు నిర్వహించాల్సిన ఫైల్స్ నిర్వాహణ మరో విభాగం ఉద్యోగుల జోక్యం పెరిగింది. వరసగా జరుగుతున్న ఆడిట్ జనరల్ ఆడిట్ తలనొప్పిగా మారాయి. ఒక వైపు లోకాయుక్త కేసులను ఎదుర్కొని వరస సస్పెన్షన్ వేటు పడుతున్నా మరో వైపు అధికారుల తీరు మారటం లేదని విమర్శలు వెలువడుతున్నాయి.

నలుగురు సస్పెన్షన్

తిరుమలాయపాలెం మండలం బీరోలు గ్రామదీపిక(వీవోఏ)గా కల్పన పనిచేస్తూ అదనంగా కేంద్ర ప్రభుత్వ అనుభంద ఫార్మర్ ప్రొక్యూర్‌మెంట్ కంపెనీ సీఈవోగా నాల్గు నెలల పాటు బాధ్యతలు నిర్వహించారు. ఒకే సమయంలో రెండు వేతనాలు పొందారు. ఈ విషయంలో సెర్ప్‌లో జిల్లా స్థాయిలో చర్చనీయాంశంగా మారింది. దీంతో గ్రామస్థులతో పాటుగా ఒక వ్యక్తి ఆర్‌టీఏలో వివరాలు తీసుకొని లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. దీంతో అనేక విచారణలు అనంతరం జిల్లా అధికారులకు ఆదేశాలు రావటంతో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ ఆదేశాల మేరకు విచారణ చేపట్టారు. ఒకే సమయంలో రెండు వేతనాలు పొందారనే నిరూపణ కావటంతో గురువారం తిరుమలాయపాలెం ఏపీఎం అలివేలు మంగతో పాటుగా సీసీలు జైపాల్, దేవసుందరం, రేణుకాను సస్పెన్షన్ వేటు వేశారు. కేవలం కోర్టు కేసు తీర్పు ఉపశమనం కోసం సస్పెన్షన్ వేటు వేశారా.. లేదా పూర్తి చర్యలు తీసుకుంటారా.. అని చర్చ జరుగుతుంది.

డీఆర్‌డీఏ ఓఎస్‌డీగా నియామకం

జిల్లాలోని గిరిజన మండలాల్లో సింగరేణి(కారేపల్లి) మండలం 98శాతం గిరిజన జనాభా నివాసం ఉంటారు. అయితే ఇక్కడ ఉపాధి హామీ పనులు పర్యవేక్షణ చేయాల్సిన ఏపీవో అజయ్‌ను 8నెలలుగా ఖమ్మం డీఆర్‌డీఏ కార్యాలయంలో డీఆర్డీవోకు ఓఎస్‌డీ(ఆఫీసర్ ఇన్ స్పెషల్ డ్యూటీ)గా బాధ్యతలు కేటాయించారు. నిబంధనల మేరకు ఐఏఎస్, ఐపీఎస్ స్థాయి అధికారులకు మాత్రమే ఓఎస్‌డీ విభాగంలో సహాయ ఉద్యోగుల నియామకం ఉంటుంది. సింగరేణి మండలంలో రెగ్యులర్ ఏపీవో లేక పోవటంతో అక్కడ గిరిజనులకు సరైన ఉపాధి అవకాశాలు, కార్యచరణ చేసే అధికారులు లేక పోవటంతో గిరిజన కూలీలు ఉపాధి కోల్పోతున్నారు. పలు అవినీతి అక్రమాలు జరుగుతున్నాయి.

చింతకాని ఎంపీడీవోగా, అదనపు పీడీగా..

మధిర నియోజకవర్గంలో చింతకాని మండలం ఎంతో కీలకమైనది. ఎక్కువ విస్తీర్ణంతో పాటుగా చైతన్యవంతమైన మండలం. ఇటీవల అక్కడ ఎంపీడీవోగా శ్రీనివాసరావును నియామకం చేశారు. ఇందిర డెయిరీ పాటుగా ఆరు మహిళా గ్యారెంటీ పథకాలను మోడల్‌గా ఇదే మండలంలో కార్యచరణ చేశారు. కాగా ఇక్కడ ఎంపీడీవోకు డీఆర్‌డీఏ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు కేటాయించారు. దీంతో ఎక్కువ సమయం డీఆర్‌డీఏకు ఇతర మండలాల పర్యవేక్షణకు సమయం కేటాయిస్తున్నారు.

ఏపీవో లేకున్నా ఇబ్బంది లేదు

సన్యాసయ్య, డీఆర్డీవో, ఖమ్మం జిల్లా

తిరుమలాయపాలెం సింగరేణి మండలంలో పనిచేస్తున్న ఏపీవోను కోర్టు కేసుల పర్యవేక్షణకోసం ఓఎస్‌డీగా నియమించాం. సింగరేణి మండలంలో ఏపీవో లేక పోయినా ఎటువంటి ఇబ్బంది లేదు. చింతకాని మండలం ఎంపీడీవోకు అదనపు పీడీగా నియామకం జరిగింది.ఏక కాలంలో రెండు ప్రాంతాల్లో విధులు నిర్వహించినా ఏరోజు ఎక్కడ విధులు నిర్వహిస్తే ఆ రోజు అక్కడ హాజరు నమోదు జరుగుతుంది. సాంకేతికంగా ఎటువంటి ఇబ్బందులు లేవు. కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్ణయాలు తీసుకుంటున్నాం.

బీమాను సద్వినియోగం చేసుకోవాలి



చెక్కును అందజేస్తున్న దృశ్యం

తల్లాడ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఎస్‌బీఐలో ఖాతాదారులైనవారు బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ ఖమ్మం రీజనల్ మేనేజర్ గోపగాని లింగస్వామి అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్‌బీఐ బ్రాంచ్‌లో పీఎంఎస్‌బీవై రూ.రెండులక్షల చెక్కును ఖాతాదారులు పొన్నెబోయిన వెంకటీకు ఆయన అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ తల్లాడ బ్రాంచ్ మేనేజర్ ఎం.ఫణికుమార్, ఫీల్డ్ ఆఫీసర్ కె.శ్రీనివాస్, అకౌంటెంట్ వై.భీమరాజు, క్యాష్ ఆఫీసర్ కె.వెంకటేశ్వరరావు, క్లర్క్ కె.నాగరాజు, బి.సురేష్, మాజీ సర్పంచ్‌లు మోహన్‌రావు, పోట్రు శరత్‌బాబు పాల్గొన్నారు.

విద్యార్థుల వైజ్ఞానిక టూర్



వైజ్ఞానిక టూర్‌లో పాల్గొన్న విద్యార్థులు

తల్లాడ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): శాస్త్ర సాంకేతిక, చారిత్రక, సాంస్కృతిక అంశాల పట్ల అవగాహన కల్పించేందుకు పీఎంశ్రీ ఎక్స్‌పోజర్ సందర్శనలో భాగంగా తల్లాడ మండలం కుర్నవల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం పర్యాటక ప్రాంతాలను సందర్శించారు. లక్నవరం, రామప్ప, వెయ్యిస్తంభాల గుడి, కాకతీయ జూపార్క్, వరంగల్ కోట తదితర ప్రదేశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా పర్యాటక ప్రాంతాలకు ఉన్న చారిత్రక నేపథ్యాన్ని విద్యార్థులకు ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీరాణి వివరించారు.

పందిళ్లపల్లిలో గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ

చింతకాని, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పందిళ్లపల్లి మున్నేరు పరివాహక ప్రాంతం గంగా గౌరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద శుక్రవారం గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం అత్యంత భక్తి శ్రద్దలతో నిర్వహించారు. అర్చకులు బొర్ర వాసుదేవా చార్యులు సమక్షంలో యాగ కార్యక్రమం వేదమంత్రాలతో కొనసాగింది. భక్తుల కోలాహల నడుమ విగ్రహ ప్రతిష్ట గంగమ్మతల్లి నామస్మరణతో వైభవంగా జరిగింది. కార్యక్రమంలో గ్రామస్థులు లింగం రాంబాబు, చింతకాయల నరేష్, వత్సవాయి జానకిరాములు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కొమ్మేపల్లిలో కొనసాగుతున్న దీక్షలు



దీక్షలో పాల్గొన్న వారు

సత్తుపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కోల్పోయిన భూములకు నష్ట పరిహారం ఇప్పించాలని, అప్పటివరకు తమ భూముల్లోకి రావద్దంటూ కొమ్మేపల్లిలో భూనిర్వాసితులు చేపట్టిన దీక్షలు శుక్రవారంతో ఐదవ రోజుకు చేరాయి. భూములలోకి పనులు చేసేందుకు జేవీఆర్ ఓసీ పీవో ఎన్‌ఆర్.ప్రహ్లాద్ అక్కడికి చేరుకోగా నిర్వాసితులు అయన్ను అడ్డుకున్నారు. నిబంధనల ప్రకారం తమకు పరిహారం ఇచ్చినతర్వాతే పనులు చేపట్టాలని, అప్పటివరకు కదిలేది లేదంటూ తమ వాదన వినిపించారు. తమ అనుమతి లేకుండా తమ భూముల్లో వేసిన ట్రెంచ్‌ను ఎందుకు తొలగించారని, నష్ట పరిహారం పూర్తిగా ఇవ్వకుండా భూములలోకి ఎందుకు వస్తారంటూ అధికారులను ప్రశ్నించారు. దీక్షలకు బీజేపీ, సీపీఐ(ఎం) నాయకులు సంఘభావం తెలిపారు.

ఖమ్మంలో మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

ఏన్కూరు, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): దేశంలోనే అత్యధిక విస్తీర్ణంలో ఖమ్మం పరిసర ప్రాంతాల్లో మిర్చి సాగుచేస్తున్న నేపథ్యంలో ఖమ్మంలో మిర్చి బోర్డు ఏర్పాటుచేయాలని తెలంగాణ రైతుసంఘం జిల్లాకార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. ఈనెల 18న తలపెట్టిన మిర్చి రైతుల ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం రాయమాధారం, మర్సకుంట, బిక్యాతండా, తిమ్మరావుపేట, గ్రామాల్లో ప్రచారం నిర్వహించారుక. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మిర్చిక్వింటాకు రూ.25వేలు ధర నిర్ణయించాలని కోరారు. దేశంలో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మిర్చిసాగు ఎక్కువగా ఉందన్నారు. వైరస్, తెగుళ్ల ఎక్కువగా ఉందన్నారు. ఈకార్యక్రమంలో రైతుసంఘం మండల కార్యదర్శి గుండా సత్యనారాయణరెడ్డి, దొంతబోయిన నాగేశ్వరరావు, వేల్పుల రాములు, గుండా కమలమ్మ, మాజీసర్పంచ్ కొండే బిక్షం, కమలమ్మ పాల్గొన్నారు.

క్షయరహిత సమాజమే లక్ష్యం

ఏన్కూరు, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): క్షయరహిత సమాజం కోసం ప్రభుత్వం విశేషంగా కృషిచేస్తుందని వైద్యాధికారి రాములు అన్నారు. శుక్రవారం గంగుల నాచారంలో టీబీ వ్యాధిపై అవగాహన కలిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండువారాలకు మించి దగ్గు, కఫం, జ్వరం, బరువు, ఆకలితగ్గడం, ఉమ్మిలో రక్తం పడడం వంటి లక్షణాలు ఉన్నవారు వెంటనే వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. లక్షణాలు ఉన్న వారు వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శివరాజ్, టీబీ విభాగ సూపర్‌వైజర్ సురేష్, ల్యాబ్ సూపర్‌వైజర్ సంజీవ్‌కుమార్, ఏఎన్ఎం కమల, ఆశాకార్యకర్త రమణ, ల్యాబ్‌టెక్నిషియన్ ఉప్పెర్ల వెంకటరమణ పాల్గొన్నారు.